నవతెలంగాణ
మెదక్
1
బుధవారం | 24 జులై 2024 | www.navatelangana.com

అప్పుల బాధతో గీతా కార్మికుడి ఆత్మహత్య



నవతెలంగాణ-తొగుట : అప్పుల బాధతో గీతా కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు మండలంలోని లింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం ఎస్ఐ రవి కాంతరావు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన చేపూరి ఆంజనేయులు గౌడ్ (46) గత కొద్దికాలంగా మహారాష్ట్రలో దేశిదారు దుకాణం నడుపుతుండేవాడు. అక్కడ దుకాణం సరిగా నడవక అప్పులు పాలయ్యాడు. రెండు సంవత్స రాల క్రితం లింగాపూర్ గ్రామానికి చేరుకున్నాడు. గ్రామంలో అర ఎకరం వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయం, గీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మహారాష్ట్ర దేశిదారు దుకాణానికి అయిన అప్పులు ఎలా తీర్చాలని బాధపడుతూ మద్యానికి బానిసైయ్యాడు. ఈ విషయమై సోమ వారం నువ్వు మధ్యానికి బానిసై తే మనకు అయి న అప్పులు ఎలా తీర్చుతామని భార్యాభర్తలిద్దరూ గొడవ పడ్డారు. ఇట్టి విషయమై భార్య భాగ్యలక్ష్మి తన తల్లిగారి ఇంటికి దౌలాపూర్ గ్రామానికి వెళ్ళిం ది. ఆంజనేయులు లింగాపూర్ గ్రామంలో ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో చేరాడు. చుట్టూ పక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వా సుత్రికి తరలిం చారు. డాక్టర్ పరిశీలించి మృతి చెందినట్లు తెలి పారు. మృతని భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించామని అన్నారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిర్వహిం చిన శవాన్ని కుటుం బ సభ్యులకు అప్పగించామని తెలిపారు. మృతునికి బార్య, యస్వంత్ గౌడ్, వైష్ణవి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమలో కార్మికులపై వేధింపులు ఆపాలి

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య
నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం



బొల్లారంలోని డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమలో కార్మికులను వేధింపులకు యజమాన్యం గురి చేస్తుందని, ఈ వైఖరి వెంటనే విడనాడాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రెడ్డీస్ పరిశ్రమలో గత అనేక సంవత్సరాల నుంచి పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులను తొలగిస్తుందని ఆరోపించారు. బలవంతంగా కార్మికులను పంపిస్తుందన్నారు. పరిశ్రమ ఒకవైపు లాభాలతో నడుస్తుంటే, లక్షల కోట్లు సంపాదిస్తుంటే కార్మికులను మాత్రం వేధించి బయటకు పంపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల మీద పని భారం విపరీతంగా పెంచుతున్నారని, అన్ని రకాలుగా వేధిస్తున్నారన్నారు. పరిశ్రమ యజమాన్యం మొండివైకరి విడనడకపోతే పరిశ్రమ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రాజయ్య హెచ్చరించారు.

పలు రైస్ మిల్లులను తనిఖీ చేసిన అధికారులు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండలంలోని పలు రైస్ మిల్లులను మంగళవారం సివిల్ సప్లై, రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీ చేశారు. రైస్ మిల్లులకు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యానికి బదులుగా రైస్ మిల్లర్లు ఇచ్చిన కోట ప్రకారం ఎంత బియ్యం చెల్లించారని, రైస్ మిల్లులో ఎంత ధాన్యం ఉందని ఇంకా ఎంత చెల్లించాల్సి ఉందని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి రైస్ మిల్లులో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎంసిఎస్ హరికృష్ణ మాట్లాడుతూ సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాల మేరకు మెదక్ జిల్లాలో 23 రైస్ మిల్లులను, నర్సాపూర్ డివిజన్ పరిధిలోని ఆరు రైస్ మిల్లులను మంగళవారం సివిల్ సప్లై, రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీ చేశామన్నారు. తనిఖీ చేసిన వారిలో ఆర్డిఓ జగదీశ్వర్ రెడ్డి, తహాశీల్దార్ కమలాద్రి, జ్ఞాన జ్యోతి, ఆర్ ఐ సిద్ధిరాంరెడ్డి, సీఐ జాన్ రెడ్డి, ఎస్సై పుష్ప రాజ్, ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నార్సింగి



మండలంలోని రైస్ మిల్లుల ను తహసీల్దార్ షేక్ కరీం ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై అహ్మద్ మొహిఉద్దీన్, ఎంపీడీవో చిన్నారెడ్డి రెవెన్యూ ఇన్స్పెక్టర్ నవీన్ రావుతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మిల్లులో ధాన్యం నిలువ, సిఎంఆర్ బియ్యం నిల్వలను తనిఖీ చేశారు. రైస్ మిల్లులో ఉన్న స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యం పక్కదారి పట్టకుండా ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు

ఎంఎస్ఎన్ యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి

సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య
సిఐటియు ఆధ్వర్యంలో డీసీఎల్ కు ఫిర్యాదు



నవ తెలంగాణ-పటాన్ చెరు

ఎమ్ఎస్ఎన్ యాజమాన్యంపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య డిమాండ్ చేశారు. ఐడిఏ పాశ మైలారంలోని ఎంఎస్ఎన్ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం డిసిఎల్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య మాట్లాడుతూ ఎంఎస్ఎన్ పరిశ్రమపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. పరిశ్రమలో ప్రమాదం జరిగి ఇద్దరు కార్మికులు మృతి చెందారన్నారు, కార్మికులు మృతి చెందితే చడి చప్పుడు లేకుండా శవాలను పంపించిన పరిస్థితి ఉందని ఆరోపించారు. యజమాన్యం ప్రమాదాన్ని దాచి పెట్టిందని ఆయన దుయ్యబట్టారు. చనిపోయిన కార్మిక కుటుంబాలకు కూడా నష్టపరిహారం చెల్లించడంలో కూడా నిర్లక్ష్యం వహించిందన్నారు, ప్రమాదాన్ని ఎందుకు దాచిందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎంఎస్ఎన్ పరిశ్రమలలో అనేక సార్లు ప్రమాదాలు జరుగుతున్నా, పరిశ్రమ యజమాన్యం రక్షణ చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. యాజమాన్యంపై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల గురించి గానీ, కార్మికుల భద్రత గురించి గాని ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. యజమాన్యం తగిన చర్యలు తీసుకోక పోవడం ఫలితంగానే ప్రమాదం జరిగిందన్నారు. ప్రభుత్వ అధికారులు అన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉన్నట్లైతే హిస్టరీ షీట్ క్లోస్

జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్
జిల్లాలో జరుగుతున్న చట్ట వ్యతిరేఖ కార్యాలయపాలపై సమాచారం ఇవ్వాలి
గంజాయి పండించిన, అక్రమ రవాణా చేసిన, అమ్మిన ఎస్-నాబ్ 8712656777కు ఫిర్యాదు చేయాలి



నవతెలంగాణ-పటాన్ చెరు

సత్ప్రవర్తన కలిగి ఉన్నట్లయితే హిస్టరీ షీట్ క్లోస్ చేస్తామని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. జిల్లాలో ఉన్న రౌడీలు, కేడిలు, సస్పెక్ట్ లకు సబ్-డివిజన్ల వారీగా నిర్వహిస్తున్న కౌన్సిలింగ్ లో భాగంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పటాన్‌చెరు సబ్-డివిజన్‌కు సంబంధించిన హిస్టరీ షీటర్లకు జిల్లా ఎస్పీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీలు, కేడిలు సస్పెక్ట్ సత్: ప్రవర్తన కలిగి ఉండాలని, మునుపటిలాగా ఇష్టా రీతిగా ఉంటూ సామాన్య ప్రజానికానికి, ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పుట్టుకతో ఎవ్వరూ నేరస్తులు కారని, వారి పరిస్థితుల ప్రభావం వలన నేరస్తులుగా మారి ఉండవచ్చని, మీ జీవితాన్ని తిరిగి మామూలుగా, సాదారణ జీవితం గడపాలంటే మీ ప్రవర్తన మీద ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు చేసిన నేర ప్రవృత్తిని మానుకోవాలని, సత్: ప్రవర్తన కలిగి ఉన్నట్లైతే హిస్టరీ షీట్ క్లోస్ చేస్తామన్నారు. జిల్లాలో గంజాయి పండిచిన, అక్రమ రవాణా చేసిన, అమ్మిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలవాటుపడిన నేరస్తులపై పి.డి.యాక్ట్ నమోదు చేసి హిస్టరీ షీట్స్ ఓపెన్ చేయడం జరుగుతుందని తెలిపారు. కొత్తగా వచ్చిన బియన్.యస్. చట్ట ప్రకారం కఠిన చర్యలున్నాయని, ఇద్దరు ముగ్గురు కలిసి నేరాలకు పాల్పడినట్లయితే ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా పరిగణించి కఠినంగా శిక్షించడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు సబ్ డివిజన్ పోలీస్‌లు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో నిరాశే



- రైల్వే ప్రాజెక్టులు...నిమ్జ్ ప్రాజెక్టు పట్ల నిర్లక్షం
- గ్రామీణ పేదల అభివృద్ధి పట్టని వైనం
- ఉపాధి హామీ, మధ్యాహ్న భోజన పథకాలకు నిధుల కోత
- కొత్త పరిశ్రమల విస్మరణ...ఆర్డినెన్స్, ఓడీఎఫ్, బీహెచ్ఈఎల్‌కు నో ఆర్డర్లు
- ఉమ్మడి మెదక్ జిల్లాకు మొండి చెయ్యే: విపక్షాలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీలా ఉందని విపక్షాలు ధ్వజమెత్తగా వికసిత్ భారత్ దిశగా అడుగులు పడ్డాయని బీజేపీ బలపర్చుకుంటుంది. ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ కూర్పులో తెలంగాణతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాకు కూడా నిరాశే మిగిల్చింది. కొత్తగా రైల్వే లైన్ల ప్రస్తావన లేకపోగా పాత ప్రాజెక్టులకు అదనంగా నిధులేమీ ఇవ్వలేదు. మెట్రో విస్తరణ మాటెత్తలేదు. ప్రతిష్టాత్మకమైన రక్షణ రంగ పరిశ్రమలైన ఆర్డినెన్స్, ఓడీఎఫ్‌ను విస్మరించింది. బీహెచ్ఈఎల్‌కు ఆర్డర్లేమీ ఇవ్వలేదు. త్రిబుల్ ఆర్ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు ప్రశ్నార్థమైంది. జాతీయ పెట్టుబడులు, ఉద్పాదక మండలి (నిమ్జ్)కు నిధులివ్వలేదు. పైగా గ్రామీణాభివృద్ధి పథకాలైన ఉపాధి హామీ, మధ్యాహ్న భోజనం, ప్రధాన మంత్రి ఆవాజ్‌యోజన ఇళ్ల నిర్మాణం వంటి పథకాలకు నిధుల్ని కోత పెట్టారు. రైతులు, నిరుద్యోగులకు ఊరట కల్పించామని చెప్పినా ఆవి ఆచరణలో సాధ్యం చేసే చిత్తశుద్ధి లేదనే చెప్పాలి. కేంద్ర బడ్జెట్‌పై సీపీఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మండిపడ్డాయి.

నిమ్జ్‌కు నిధులేవీ..?

జాతీయ పెట్టుబడులు, ఉద్పాదక మండలి (నిమ్జ్) ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో నిధుల ప్రస్తావనలేదు. 31 వేల కోట్ల పెట్టుబడులు, 3 లక్షల మందికి ఉపాధి కల్పన లక్ష్యంగా జహీరాబాద్ ప్రాంతంలో 2012లో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం 12635 ఎకరాల భూముల్ని సేకరించాలని బావించారు. మొదటి దశలో భాగంగా 17 గ్రామాలకు చెందిన 3500 ఎకరాల్ని సేకరించే దిశగా అడుగులు పడ్డాయి. అయితే ఈ ప్రాజెక్టుకు కేంద్రం భారీ ఎత్తున నిధులు కేటాయిస్తే తప్ప లక్ష్యం నెరవేరదు. 2024-25 బడ్జెట్‌లో నిమ్జ్ ప్రాజెక్టు కోసం కేంద్రం నిధులివ్వకపోవడంతో సంగారెడ్డి జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో కొత్త అడుగులు పడే పరిస్థితి లేదు. కేవలం రాష్ట్ర ప్రభుత్వమే ప్రాజెక్టును పూర్తి చేయలేదు. భూసేకరణకు భారీ బడ్జెట్ అవసరమున్నందున కేంద్రం నిధులివ్వాలని రాష్ట్రం ఎన్నో సార్లు కోరింది.

త్రిబుల్ ఆర్‌కూ నిరాశేనా

రీజినల్ రింగ్ రోడ్డు (త్రిబుల్ ఆర్) ప్రాజెక్టుకు కేంద్రం పెద్దగా ప్రాధాన్యనివ్వలేదు.

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర పెద్దల్ని కలిసి నిధులివ్వాలని కోరారు. త్రిబుల్ ఆర్‌కు నిధులివ్వకపోవడం వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాకు తీరని నష్టం వాటిల్లనుంది. ఎందుకంటే ఉత్తర భాగం భువనగిరి నుంచి జగదేవ్‌పూర్, గజ్వేల్, నర్సాపూర్, సంగారెడ్డి వరకు 158 కిలో మీటర్లు, దక్షణ భాగం చౌటుప్పల్, షాద్‌నగర్ మీదుగా సంగారెడ్డి కంది వరకు 181 కిలో మీటర్లు త్రిబుల్ ఆర్ ఏర్పడనుంది. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి మూడు జిల్లాల పరిధిలో 110 కిలో మీటర్ల మేర త్రిబుల్ ఆర్ రోడ్డ నిర్మాణం చేయనున్నారు. ఇప్పటికే భూ సేకరణ పనులు జరుగుతున్నాయి. రైతులు నష్టపరిహారం విషయంలో పలు చోట్ల భూ సేకరణను అడ్డుకుంటున్నారు. మెరుగైన పరిహారం ఇవ్వడం, రోడ్డు నిర్మాణం కోసం అవసరమైన నిధుల్ని కేంద్రం ఇవ్వకుండా తీరని అన్యాయం చేసింది.

రైల్వేలకూ నిధుల విస్మరణ

ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పలు రైల్వే లైన్లకు మోక్షం లభించడంలేదు. డబుల్‌లైన్, ఆధునీకరణ, ఆర్ఓబీలు, కొత్త లైన్ల విస్తరణ కోసం అవసరమైన నిధుల గురించి బడ్జెట్‌లో ఏలాంటి ప్రస్తావన లేదనే చెప్పాలి. సికింద్రాబాద్ నుంచి మన్మార్ వెళ్లే రైల్వేలైన్ మెదక్ జిల్లా మీదుగా వెళ్తుంది. సింగిల్‌లైన్ కావడంతో క్రాసింగ్ సమస్యలేర్పడుతున్నాయి. అలాగే మేడ్చేల్, మనోహరాబాద్, వడియారం, మిర్జాపల్లి, అక్కన్నపేట, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మబాద్, నాందేడ్ స్టేషన్లు ముఖ్యమైనవిగా ఉన్నాయి. ఈ మార్గంలో 247 కిలో మీటర్ల వరకు డబులింగ్ పనులు కొన్ని చోట్ల కాలేదు. మెదక్ మార్గంలో రెండు రైళ్లు నడుస్తున్నాయి. మెదక్ వరకే లైన్ వేశారు. వట్టినాగులపల్లి నుంచి సంగారెడ్డి, జోగిపేట మీదుగా జహీరాబాద్ వరకు రైల్వేలైన్ వేయాల్సి ఉంది. మెదక్ జిల్లా చేగుంట సమీపంలో లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్ఓబీ మంజూరు కావాలి. మాసాయిపేటలో రేక్‌పాయింట్ మంజూరు చేయాలి. వడియారం స్టేషన్‌లో రాయాలసీమ, అక్కన్నపేటలో అజంతా ఎక్స్‌ప్రెస్ రైళ్లన నిలపాలిని స్థానికులు కోరుతున్నారు. జహీరాబాద్ స్టేషన్‌ను అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.24 కోట్లతో ఆధునీకరిస్తున్నారు. ఇది వేగంగా పూర్తి చేయడానికి నిధుల్ని విడుదల చేయాలి. కొమురవెల్లి రైల్వేలైన్ శంపుస్థాపనకే పరిమితమైంది. మియాపూర్ నుంచి లింగంపల్లి, పటాన్‌చెరు, ఇస్మాపూర్, సంగారెడ్డి వరకు మెట్రోలైన్ విస్తరించాలి. ఇలాంటి రైల్వే ప్రాజెక్టుల్ని చేపట్టేందుకు అవసరమైన నిధుల్ని మంజూరు చేయిస్తామని ఎంపీ ఎన్నికల్లో ఎంపీ రఘునందన్‌రావు ప్రజలకు హామీ ఇచ్చారు. నిధుల్ని రాబట్టడంలో మాత్రం చేతులెత్తేశారు.

గ్రామీణాభివృద్ధి పథకాలకు నిధుల కోతలు

కేంద్ర బడ్జెట్‌లో ఏడు రంగాలకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పినా ఆ మేరకు నిధుల కేటాయింపుల్లేవు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.2 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ ఉండగా కేవలం గత ఏడాది మాదిరే రూ.86 వేల కోట్లే కేటాయించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పది లక్షల మంది గ్రామీణ పేదలు ఈజీఎస్ పనుల మీద ఆధారపడి జీవిస్తున్నారు. 200 పని దినాల కల్పించాలని, పట్టణాలకూ పథకాన్ని వర్తింప చేయాలనే డామాండ్‌ను పట్టించుకోలేదు. సామాజిక వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీల్లోని పేద పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ స్కూళ్లల్లో అందించే మధ్యాహ్న భోజన పథకానికీ నిధుల్ని కోత పెట్టారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 2.5 లక్షల మంది మిడ్డే మీల్స్ పథకంలో లబ్ధిపొందుతున్నారు. గతేడాది రూ.21,527 కోట్లు కేటాయించి ఈ సారి మాత్రం 21200 కోట్లే విదిల్చారు. ఆహార పదార్థాల ధరలు 3.5 శాతం నుంచి 7.5 శాతానికి పెరిగాయని అంగీకరించి ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం ఆహార సబ్సిడీలలో కోత పెట్టింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 7.5 లక్షల తెల్లరేషన్‌కార్డుల ద్వారా రేషన్ బియ్యం పొందుతున్నారు. వీరందరికీ సరుకులిచ్చేందుకు సరిపడ నిధుల్ని ఇవ్వలేదు. అలాగే ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద పేదలకు ఇళ్లు నిర్మించేందకూ నిధుల్ని ఇవ్వలేదు. దీంతో రాష్ట్రంలో చేపట్టే ఇందిరమ్మ ఇళ్ల పథకమూ కుంటు పడే పరిస్థితి ఉంది.

కేంద్ర బడ్జెట్‌పై విపక్షాల పెదవి విరుపు

ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్



ఉమ్మడి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించకుండా నిరాశే మిగిల్చిందన్నారు. జిల్లా ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్న రైల్వే లైన్‌కు నిధులు కేటాయించలేదన్నారు. ఈ బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ బడ్జెట్‌గా ఉన్నదన్నారు. రైతులు, కూలీలు, ఉద్యోగులు, కార్మికులను పూర్తిగా విస్మరించిందన్నారు. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక బడ్జెట్ అన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం


బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్ రాజకీయ ప్రేరేపితంగా ఉంది అని ప్రజల కోసం పెట్టింది కాదన్నారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై చూపుతున్న వివక్షను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ఇద్దరు కేంద్ర మంత్రులు 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్న కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తగిన వాటా పొందడంలో విఫలమయ్యారన్నారు. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేకపోవడం బాధాకరం అని అన్నారు.తెలంగాణకు మరోసారి ఈ కేంద్ర బడ్జెట్లో దక్కింది గుండు సున్నా అని అన్నారు. తెలంగాణలో 16 స్థానాలను బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలకు ఇస్తే ఏం జరిగిందో తెలంగాణ ప్రజలు ఆలోచించాలి అని అన్నారు.

బీజేపీకి అధిక ఎంపీలు ఉన్నా తెలంగాణకు మొండి చేయి

-ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నా తెలంగాణకు మొండి చేయి చూపిందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు మొండి చేయి చూపించారని, విభజన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు.. విద్యా వైద్యం ఉపాధి రైతాంగం మెజార్టీ ప్రజల బడ్జెట్ కాదని పెద్దల బడ్జెట్ గా ఉన్నదన్నారు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే బడ్జెట్ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిందని కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్క రైతుకు రుణమాఫీ చేయలేదన్నారు. అంబానీ ఆదానీలకు రుణాలు మాఫీ చేశారని, బిజెపి పాలిత ప్రాంతానికి అధిక నిధులు కేటాయిస్తున్నారని ఆరోపించార.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే బడ్జెట్

ఎంపీ సురేష్ సెట్కార్



గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర మోడీ ప్రభుత్వం చేస్తోందని, రైతంగాన్ని నట్టేటల ముంచే బడ్జెట్ కేటాయించారని ఎంపీ సురేష్ షెట్కర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం పది సంవత్సరాల నుంచి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని ఉద్యోగాల మాట ఉత్తదే అయిందని ఈ బడ్జెట్లో తేటతెల్లమైందన్నారు. గత పది సంవత్సరాలలో కార్పొరేట్లకు 11 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చిందని రైతాంగానికి 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేదల పొట్ట కొట్టేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పనుతున్నదని ఆరోపించారు బడ్జెట్లలో గ్రామీణ ఉపాధి పథకాన్ని నిధులు తగ్గించుకుంటూ వచ్చారన్నారు. బీహార్, ఆంధ్రప్రదేశ్ మాత్రమే ప్యాకేజీలు ఇచ్చారని మిగతా రాష్ట్రాలకు మొండి చేయి చూపించారన్నారు.. నారాయణఖేడ్ ప్రాంతానికి ప్యాకేజీ కేటాయించాలని మోడీ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. తెలంగాణకు విద్యుత్ సంబంధించిన బడ్జెట్లో అన్యాయం జరిగిందన్నారు

కేంద్ర బడ్జెట్ సంపన్నుల బడ్జెట్

సీపీఐ (ఎం) మెదక్ జిల్లా జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం



ఆహార పదార్థాల వ్యయం 3.5% నుంచి 7.5%నికి పెరిగిందని ఒక వైపు చెపుతూనే ధరల నియంత్రణకు ఎలాంటి, ప్రత్యామ్నాయ చర్యలు లేవు. గ్రామీణ పేదల ఉపాధి హామీ పథకానికి మొండి చేయి చూపుతూ గత కేటాయింపులే చూపింది. రేషన్ షాపుల ద్వారా పేదలకు కేటాయించే నిధులను గతంలో రెండు లక్షల పన్నెండు కోట్ల నుంచి రెండు కోట్ల ఐదు లక్షలకు తగ్గించింది.తెలంగాణ విభజన హామీకి ఎలాంటి కేటాయింపులు లేవు. కార్మికుల సంక్షేమానికి ఎలాంటి కేటాయింపులు, నిరుద్యోగులకు ఎలాంటి కేటాయింపులు లేవు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యం

జాగిలాల ద్వారా వెహికల్స్ చెకింగ్
జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో గంజాయి, నార్కోటిక్ డ్రగ్, ఓపియం, ఆల్ఫాజోలం వంటి మాదక ద్రవ్యాల మూలాలు లేకుండా చేయడానికి, జిల్లా నుంచి అక్రమ రవాణా జరగకుండా జిల్లా పోలీసు శాఖ విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. డాగ్ స్క్వాడ్ సేవలను వినియోగించుకొని జిల్లాలో వివిధ ప్రాంతాలలో ర్యాండంగా స్పెషల్ డ్రైవ్స్ చేపట్టామన్నారు. ఇందులో భాగంగా సంగారెడ్డి రూరల్ ఎస్ఐ. వినయ్ కుమార్ సిబ్బందితో కలిసి యం.యన్.ఆర్. చౌరస్తాలో నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలో స్నిఫర్, నార్కోటిక్, ఎక్స్ప్లోసివ్స్ ను నివృత్తి చేయగల సామర్థ్యమున్న జాగిలాల సేవలను వినియోగించి వెహికిల్స్ చెక్కింగ్ నిర్వహించామని తెలిపారు. జిల్లాలో గంజాయి పండించినా, అక్రమ రవాణ చేసినా చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అట్టి వ్యక్తుల వివరాలను ఎస్ ఎన్ ఏ బి నెంబర్: 8712656777 కు వాట్స్ అప్ ద్వారా లేదా ఫోన్ చేసి గాని సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పి తెలిపారు.

సింగూర్ ప్రాజెక్ట్ నీటిని గుండు వాగుకు తరలించాలి

- టేక్మాల్, అల్లాదుర్గం, పాపన్నపేట్ మండలాలకు సాగునీరు అందించాలి
- బడ్జెట్‌లో రూ.50 కోట్ల నిధులు కేటాయించాలి
- రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్



నవతెలంగాణ-టేక్మాల్

సింగూర్ ప్రాజెక్ట్ నీటిని గుండు వాగుకు తరలించాలని, దానీ ద్వారా టేక్మాల్, అల్లాదుర్గం, పాపన్నపేట్ మండలాలకు సాగునీరు అంది సస్యశ్యామలం అవుతాయని, ఈ బడ్జెట్ లో రూ.50 కోట్ల నిధులు కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. స్థానిక టేక్మాల్ మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సాగునీటి కోసం సింగూరు జలాలను గుండు వాగుకు తరలించాలనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం బొంత బాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావే శానికి ముఖ్య అతిథిగా హాజరైన శోభన్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో టేక్మాల్, అల్లాదుర్గం, పాపన్నపేట మండలాల్లోని 50 గ్రామాలకు సింగూర్ నీళ్లను గుండువాగు ద్వారా రైతాంగానికి సాగునీరు ఇవ్వాలని అన్నారు. ఈ సాగునీటి సమస్య పరిష్కారానికి బడ్జెట్లో రూ.50 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. సింగూర్ నీళ్లను ఇప్పటికే సంగారెడ్డి జిల్లాలో ఆందోల్, పుల్కల్ మండలాలకు కాలువల ద్వారా చెరువులు నింపుతున్నారన్నారు. రాష్ట్రంలో అనేక జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో కాళేశ్వరం జలాల వాగుల ద్వారా కాలువల ద్వారా చెరువులు నింపుతున్నారు. మెదక్ జిల్లాలో ఇలాంటి అనుభవం కూడా ఉందన్నారు. మెదక్, కొల్చారం, ఘణపురం మండలాల్లోని చెరువులు ఘణపురం ఆనకట్ట నీటి కాలువల ద్వారా చెరువులు నింపుతున్నారన్నారు. సింగూరు ప్రాజెక్ట్ నీళ్లను గుండు వాగు ద్వారా మండలాల్లో చెరువులు నింపడానికి నిధులు కేటాయించాలని 2016-17 ఏడాదిలో రైతుల ఆందోళన ద్వారా నాటి ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోయామన్నారు. అప్పటి ఇరిగేషన్ మంత్రి నిధులు కేటాయించినట్లు ప్రకటించారు. అది నేటికీ ఆచరణ రూపంలో దాల్చలేదని అన్నారు. లేనిపక్షంలో రైతులను ఐక్యం చేసి ఉద్యమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లేశం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.భాగయ్య, నాయకులు బసవరాజు, జె.సంతోష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హస్పిటల్ కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

హాస్పిటల్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా, సూపరింటెండెంట్‌కు వినతి



నవతెలంగాణ-జహీరాబాద్

కమ్యూనిటీ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం జహీరాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో పనిచేసిన కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని, ప్రతి నెల సమయానికి ఇవ్వకుండా ఇబ్బందుల గురి చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యాదగిరి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్‌లు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న జీతాలు ఇవ్వకపోవడంతో అనేక రకాల ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని, సమస్యలను పరిష్కరించి పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. స్పందించిన సూపరింటెండెంట్ శ్రీధర్ తక్షణమే కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేతనాలు చెల్లించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి ఎలీషా నాయకులు సుమలత ,పవన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్ చెరు పారిశ్రామికవాడలో భారీ సైబర్ మోసం

స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్ మెంటులో కోటి రూపాయలు పోగొట్టుకున్న బాధితుడు
పటాన్‌చెరు పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
సకాలంలో స్పందించిన పటాన్‌చెరు పోలీసులు
1930 కాల్ ద్వారా రూ.24 లక్షలు ఫ్రీజ్ చేయించిన పోలీసులు



నవ తెలంగాణ-పటాన్ చెరు

పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో భారీ సైబర్ మోసం వెలుగు చూసింది. ఫేక్ స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ మెంట్ చేసి సుమారు కోటి రూపాయల వరకు మోసపోయి పోలీసులను ఆశ్రయించాడు. సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏపీఆర్ గ్రాండియో గేటెడ్ కమ్యూనిటీలో నివాసముండే బెజవాడ నాగార్జున (36) కు నాడియ కామి అనే మహిళ వాట్స్‌ఆప్ మెసేజ్ ద్వారా స్టాక్ మార్కెట్‌లో ఇన్వెష్ట మెంట్‌లో ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ మొత్తంలో సంపాదించొచ్చు అనే ఆశతో రూ.99,78,526.70 (సుమారు కోటి రూపాయలు) ఇన్వెష్ట చేసి మోసపోయానని గ్రహించాడు. వెంటనే తేరుకున్న బాధితుడు నాగార్జున పటాన్‌చెరు పోలీసులను ఆశ్రయించి తనకు జరిగిన సైబర్ మోసం గురించి వివరించాడు. వెంటనే స్పందించిన సీఐ ప్రవీణ్ రెడ్డి 1930 నెంబర్‌కు కాల్ చేసి వివిధ ఫ్రాడ్ స్టార్స్ అకౌంట్‌లలో రూ.24 లక్షలను ఫ్రీజ్ చేయించారు. ఇలాంటి సైబర్ మోసాలకు ఎక్కువగా చదువుకున్నవాళ్లే మోసాలకు గురవుతున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి మోసాలకు గురైన బాధితులు సకాలంలో పోలీసులను ఆశ్రయించడం, 1930 కు కాల్ చేయడం ద్వారా సైబర్ మోసాల నుంచి రక్షించడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వ హాస్పిటల్ కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- హాస్పిటల్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో అధికారికి వినతి



నవ తెలంగాణ- కోహిర్

కోహిర్ మండలంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేసిన కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలనీ, ప్రతి నెల సమయానికి ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇబ్బందుల గురి చేస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో హాస్పిటల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యాదగిరి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ 3నెలలుగా పెండింగ్లో ఉన్న జీతం ఇవ్వకపోవడంతో అనేక రకాల ఇబ్బందులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని, సమస్యలను పరిష్కరించి పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ యనియాన్ నాయకులు మనయ్య,సురేఖ, తదితరులు పాల్గొన్నారు

పత్తి పంట సాగులో సస్యరక్షణ చర్యలు



నవతెలంగాణ-మునిపల్లి

పత్తి పంట సాగులో సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని రాయికోడు మండల ఏడిఏ సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రమైన మునిపల్లిలో మంగళవారం పత్తి పంట సాగులో పాటించాల్సిన పద్ధతులు, సత్సరక్షణ చర్యలు, జాగ్రత్తలు వంటి అంశాలపై దృశ్యశ్రవణ విధానం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ సత్యనారాయణ మాట్లాడుతూ నూతనంగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు రైతు బీమా పథకానికి ఆగస్టు ఐదవ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీ అంశంపై రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. అదేవిధంగా పంటల నమోదు పంట రుణాల పై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివకుమార్ వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పాల్గొన్నారు.

బస్సులు మురాయించడంతో ప్రయాణికుల్లో ఆందోళన



నవతెలంగాణ జహీరాబాద్

జహీరాబాద్ డిపోలోని ఆర్టీసీ నందు ఉన్న డీలక్స్ బస్సులు సూపర్ లక్సరి బస్సుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. లగ్జరీ టిక్కెట్ల డబ్బులు తీసుకున్నప్పటికీ సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని బస్సుల్లో మూడు రోజుల వరకు చెత్తాచెదారంతో పాటు మురికిమయంగా మారుతున్నాయంటున్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి బయలుదేరిన డీలక్స్ బస్సు సంగారెడ్డి నియోజకవర్గం లోని పెద్దాపూర్ జాతీయ రహదారి వద్ద మొరాయించడంతో వర్షంలోనే ప్రయాణికులంతా బిక్కుబిక్కుమంటూ ఇతర బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పాత బస్సులకే పెయింట్ పెట్టే డీలక్స్ అని రాసి నడిపించడం ద్వారానే తరచుగా ఈ బస్సులు మోరాయిస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. జహీరాబాద్ డిపోకు చెందిన ఎక్స్‌పెపెస్ సూపర్ లగ్జరీ బస్సులు వివిధ ప్రాంతాలలో మొరాయిస్తున్నాయని ప్రయాణికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి డీలక్స్ డబ్బులను వసూలు చేసినప్పుడు ఆ బస్సుల్లో సేవలు కూడా అదే మాదిరిగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

డిఎం వివరణ...

ఈ విషయమై జహీరాబాద్ డిఎం జాకీర్ హుస్సేన్‌ను వివరణ కోరగా తాను ఒకరోజు ముందే బాధ్యతలు చేపట్టాను. త్వరలోనే సమీక్ష నిర్వహించి చర్యలు చేపడతానన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపడతానన్నారు.

బీరప్ప బస్తీలో పనిచేయని బోర్లు

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- మాజీ వార్డు సభ్యులు టి.భాస్కర్



నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీరప్ప బస్తీలో బోర్లు పనిచేయకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ వార్డు సభ్యులు భాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రజలతో కలిసి ఆయన మాట్లాడుతూ బీరప్ప బస్తీలో బోర్లు పనిచేయకపోవడంతో స్థానిక ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని రోడ్లు చూస్తే దారుణంగా ఉన్నాయని. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే పని చేయని బోర్లు మరమత్తులు చేయాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-మనూర్

రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మనూర్ ఏఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం వ్యవసాయ కార్యాల యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 18సంవత్సరాలు నిండి 59వరకు వయసు ఉన్నా రైతులు అర్హులని తెలిపారు. గతంలో భీమా చేసుకొని ఉంటే వారు చేసుకోనవసరం లేదన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకొనే వారు రైతు ఆధార్ కార్డు భూమి పాస్ బుక్ నామని ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో రైతు భీమా దరఖాస్తు ఫారం జత చేయాలి సంబందించిన క్లస్టర్ ఏ ఈ ఓ లకు ఇవ్వాలని సూచించారు. 30వ తేది వరకు నామిని పేర్లు మార్పు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలి అని అయన కోరారు.

నవ తెలంగాణ-న్యాల్‌కల్ : 18 - 59 సంవత్సరాలు ఉండి, జూన్ 28 వరకు కొత్తగా పట్టా పాస్ పుస్తకం వచ్చిన వారు, గతంలో చేసుకోని రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య పేర్కొన్నారు. భూమి ఉండి ఇప్పటివరకు రైతుబిమా చేసుకొని వారికి జూలై 30 లోపు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు రైతు పాస్ పుస్తకం ఆధార్ కార్డు నామిని ఆధార్ కార్డు రేషన్ గతంలో చేసుకొని మార్పులు చేర్పులు ఉంటే వ్యవసాయ ఏఈఓ లకు వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి

థీమ్ పార్కులో ఆట వస్తువులు



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిషన్లో ఉన్న శ్రీ సాయి నగర్ కాలనీ గల థీమ్ పార్క్ లో ఆట వస్తువులను ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక కార్పొరేటర్ పుష్ప తెలిపారు. మంగళవారం రూ: 15 లక్షల విలువ చేసే ఆట వస్తువుల ఏర్పాటుకు కార్పొరేటర్ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తి దర్శన్ కార్యక్రమంలో భాగంగా శ్రీ సాయి నగర్ కాలనీలో పర్యటించినప్పుడు థీమ్ పార్క్ లో పిల్లలకు ఆడుకోవడానికి సరియైన ప్లే ఎక్విప్మెంట్స్ లేవు అని తెలుపడంతో జిహెచ్ఎంసి నిధుల నుంచి సుమారు 15 లక్షల రూపాయలతో మంజూరు చేయించి నేడు ప్లే ఎక్విప్మెంట్లను కాలనీ అసోసియేషన్, ఇంజనీరింగ్ ఏఈ ప్రభు లతో కలిసి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా కాలనీలో ఏ సమస్య ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించేందుకు సహకరిస్తానని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శంకర్ యాదవ్, రాజ్ కుమార్, ప్రకాష్, గోవర్ధన్ రెడ్డి, వీరిశెట్టి, శంకర్, సత్యనారాయణ, అక్బర్, సంగప్ప, నాగేశ్వర్ రావు, నాగరాజు, బ్రహ్మ రాజు, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఆగూర్ వెంచర్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణం లోని రంజోల్‌ని ఆగూర్ వెంచర్ను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. మంగళవారం వెంచర్ నందు ఉన్న సమస్యలను పరిష్కరిం చాలని అక్కడ ఉన్న కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పరిశీలించి డ్రైనేజీ రోడ్ల పనులను చేపట్టేందుకు అధికారులకు ఆదేశించారు. ప్రస్తుతం దోమలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆగూర్ కాలనీవాసులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై త్వరలోనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్స్పెక్టర్లు జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలు

- బండ్లు బోనాలు పోతరాజుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి



నవతెలంగాణ-గుమ్మడిదల

ఎల్లమ్మ తల్లి అమ్మవారికి బండ్లు బోనాలు పోతరాజుల విన్యాసాలతో గుమ్మడిదల గ్రామంలో మంగళవారం అంగరంగ వైభవంగా అమ్మవారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు మహిళలు శివసత్తుల పూనకాలతో అమ్మవారి దేవాలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిటలాడింది ప్రతి ఏటా ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి మొక్కుబడులు భారీగా చెల్లించుకున్నారు అశేష భక్త బృందాలతో రాజకీయాలకు అతీతంగా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు.

వివోఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి

వివోఏలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఐకెపి వివోఎలా జిల్లా కమిటీ సమావేశం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జి.సాయిలు మాట్లాడుతూ ఐకెపివివోఏలు గత 20 సంవత్సరాలు నుంచి గ్రామాలలో మహిళల అభ్యున్నతికి మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తూ మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి వారికి అవగాహన కల్పిస్తున్నారన్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించి వారికి లోన్స్ ఇప్పించి తిరిగి సక్రమంగా లోన్ చెల్లించే విధంగా అనేక పనులు చేస్తున్న వీరికి నేటికీ కనీస వేతనం లేదన్నారు. మహిళ సంఘాల పనులే కాకుండా ప్రభుత్వం చేపడుతున్న అన్ని రకాల సంక్షేమ పథకాలు విజయవంతం చేయడంలో వివోలే పాత్ర కీలకంగా ఉన్న వివోఏలకు సెర్ప్ నుంచి కేవలం రూ. 5 వేల గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తుందన్నారు. ధరలు, పన్నులు పెరుగుతున్నా వివోఏ జీతాలు పెరగడం లేదన్నారు. కొత్త ప్రభుత్వంలో తమ బతుకులో మార్పులు వస్తాయని ఆశించినప్పటికీ ఆరు నెలలైనా ఈ ప్రభుత్వం కూడా వేతనాల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఆలోచించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించి ప్రతి వివోఏకు రూ.10 లక్షల సాధారణ భీమా సౌకర్యం, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించి అర్హులైన సీసీలుగా పదోన్నతి ఇవ్వాలని. ప్రతి నెల రెగ్యులర్గా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం తప్ప



మరో మార్గం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి వివోఏలకు వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని లేనిచో రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎం. నగేష్ నాయకులు మల్లయ్య, లక్ష్మారెడ్డి, ప్రవీణ్, ఆంజనేయులు, కిష్టయ్య, లక్ష్మి, అనిత, నరేందర్, అశోక్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- భారతీయ న్యాయ సహిత 106 (1) చట్టం రద్దు చేయాలి
- ఆటో డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసులు దాడులు ఆపాలి.
- ఏఐఆర్టీ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు.



నవతెలంగాణ-కొండాపూర్

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఆర్టి డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మల్కాపూర్ చౌరస్తాలో మంగళవారం రవాణారంగ కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పబ్లిక్ ప్రైవేటు రోడ్డు ట్రాన్స్పోర్ట్ ట్రాన్స్పోర్ట్ ఏ,ఐ,ఆర్టి డబ్ల్యూ ఎఫ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు హాజరై మాట్లాడుతూ...భారతీయ న్యాయ సహిత చట్టం సెక్షన్ 106(1) రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న రవాణా రంగ కార్మికులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ,బస్సు ఉచిత ప్రయాణం పేరుతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితబస్సు ప్రయాణం పేరుతో మహాలక్ష్మి పథకం ప్రారంభించడం వల్ల రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న 50 లక్షల మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామాయ మార్గాలు చూపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు చెల్లిస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాన్ని అమలు చేయకుండా కార్మికుల పొట్ట గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రవాణా రంగ కార్మికుల సంక్షేమం చట్టం చేయాలని ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని ఆయన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోటర్ ట్రాన్స్పోర్ట్ యూనియన్ జిల్లా నాయకులు బాబురావు,నాయకులు ఫారుక్, పాండు, ఆంజనేయులు చిరంజీవి శ్రీనివాస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



నవతెలంగాణ-జోగిపేట

వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలని అటవీశాఖ , జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశించారు. మంగళవారం అందోల్ మండలం సంగుపేట గ్రామం లోని వ్యవసాయ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మొక్క లను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 75 వ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నందున సమయం వృధా కాకుండా జిల్లాకు కేటాయించిన నూరుశతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని, జిల్లా అటవీశాఖ , జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, ప్రభుత్వ సంస్థలలో మొక్కలు పెద్ద ఎత్తున నాటాలని, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం ఉపయోగపడే విధంగా మునగ, చింతపండు, కరివేపాకు తదితర మొక్కలు నాటాలని, రైతులకు కావలసిన ఉద్యానవన పండ్ల తోటలకు సంబంధించి రైతులకు కావలసిన మొక్కలు నాటించాలని సూచించారు. వన మహోత్సంలో పెద్ద మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్క బ్రతికే విధంగా సంరక్షణ చర్యలు తీసుకోవాలని, జియో ట్యాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. నర్సరీల పరిరక్షణ ముఖ్యమని, నర్సరీలలో కలుపు రాకుండా చూడాలని, షిఫ్టింగ్ గ్రేడింగ్ నిర్వహించాలని సూచించారు. అనంతరం కళాశాల లోని ల్యాబ్ ను పరిశీలించి, విద్యార్థిని లతో మాట్లాడారు . అమ్మాయిలు సంకల్పంతో విద్యావేత్తలుగా ఎదగాలన్నారు. కొత్త పరిశోధన లతో రైతులకు మేలైన వంగడాలను అందిం చాలని పేర్కొన్నారు. చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని క్రీడలు విద్యార్థి మానసి కోలాసానికి దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డిఓ జ్యోతి , జిల్లా అటవీశాఖాధికారి శ్రీధర్ రావు , డిప్యూటీ డి ఆర్ డి ఓ జంగారెడ్డి, ఆర్ డి ఓ పాండు, ఇప్పుడు తహసిల్దార్ భాస్కర్ కుమార్, ఎంపీడీవో ఉదయ్, కళాశాల ప్రిన్సుపాల్ స్పందన , ఏవో విజయ రత్న ఏ పి ఎం మాణిక్యం, ఏపీవో అర్చన ,జిల్లా సమైక్య సభ్యులు , అటవీశాఖ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని విస్మరించిన బీజేపీ ప్రభుత్వం


- సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

ఆర్భాటంగా పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ గ్రామీణ పేదలకు రైతాంగానికి రాయితీలను కుదించి బడా కార్పొరేట్లకు రాయితీలను ప్రకటించడం ఆందోళన కలిగిస్తున్నదని సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ అన్నారు. పేదలను కొట్టి పెద్దలకు పెట్టే బడ్జెట్ అని ఆయన పేర్కొన్నారు. ఆహార పదార్థాల ధరలు 3.5% నుంచి 7.5% పెరిగాయన్న ప్రభుత్వం వాటిని నియంత్రణ చేయడానికి ఎలాంటి చర్యలు చేపట్టనున్నదో బడ్జెట్లో చెప్పలేదన్నారు. పైగా తెల్ల రేషన్ కార్డు దారులకు ఇచ్చే ఆహార సబ్సిడీ గత సంవత్సరం రెండు లక్షల 12 కోట్లు కేటాయించగా ఈసారి రెండు లక్షల ఐదు కోట్లకు తగ్గించడమంటే ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వహణ బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం తప్పుకో బోతున్నదని అర్థమవుతుందన్నారు. అంటే రానున్న కాలంలో దేశంలో తెల్ల రేషన్ కార్డులు కలిగిన 85 లక్షల కోట్ల కుటుంబాలు ఆకలితో అలమటించే స్థితికి నెట్టబడతారన్నారు. గ్రామీణ ఉపాధి పనికి కనీసం రెండు లక్షల కోట్లు కేటాయించాలని మేధావులు కోరుతున్నా దానిని పట్టించుకోలేదన్నారు. గత సంవత్సరం కేటాయించిన 86 వేల కోట్లను తిరిగి కేటాయించడం అంటే పని కోసం పెరుగుతున్న గ్రామీణ ప్రాంత వలసలను నివారించాలని చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని స్పష్టం అవుతున్నన్నారు. గ్రామీణ ఉపాధి పని దినాలను 200 రోజులకు పెంచాలి పట్టణ ప్రాంతాల పేదలకు పనిని విస్తరింప చేయాలి అన్న డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద సంవత్సరానికి మూడు కోట్లు ఇండ్లు కట్టిస్తామని చెప్పిన ఆర్థిక మంత్రి బడ్జెట్లో మాత్రం గత సంవత్సరం కేటాయించిన 55 వేల కోట్లను మాత్రమే చూపిం చారన్నారు. పసి పిల్లలందరికీ పౌష్టికాహారం అందిస్తాం అంటూ నే మధ్యాహ్న భోజన పథకానికి గత సంవత్సరం కేటాయించిన 21 527 లక్షల కోట్ల బడ్జెట్ నుండి 21 200 లక్షల కోట్లకు కుదించడం చూస్తే ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది అర్థమవుతుంది. గ్రామీణ కౌలు రైతులు, పంటల గిట్టుబాటు ధరలు, రుణాలు గురించి మాట మాత్రం కూడా చెప్పకపోవడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రానికి బిజెపి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో పెట్టిన బడ్జెట్ పూర్తిగా విస్మరించిందన్నారు. తెలంగాణ ప్రజలను కేంద్ర బిజెపి ప్రభుత్వం వంచిందన్నారు వెనుకబడిన ప్రాంతాలు తెలంగాణలో కూడా ఉన్నాయని వాటికోసం బిజెపి కేంద్రం ప్రభుత్వానికి తెలువదా అని ప్రశ్నించారు. నారాయణఖేడ్ ప్రాంతానికి వెనుకబడిన ప్రాంతాల నిధుల కేటాయింపు వర్తించదా...?అని అన్నారు. నారాయణఖేడ్ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే పరిశ్రమలు రైల్వే యూనివర్సిటీ విద్య వైద్యం ఇరిగేషన్ అభివృద్ధి జరగాలన్నారు ప్రజల ఓట్లు వేయించుకొని శ్రద్ధ నారాయణఖేడ్ ప్రాంతం మీద లేదన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇచ్చినట్టుగా నారాయణఖేడ్ ప్రాంతానికి ఇవ్వాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తుందన్నారు.

శివాలయ నిర్మాణానికి లక్ష విరాళం



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలంల పరిధిలోని పంచాయతీ గ్రామీణ మంగంపేటలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి గాను ఎల్లమ్మ గూడెం గ్రామ మాజీ సర్పంచ్ ధర్మశెట్టి రవీందర్ ఒక లక్ష వెయ్యి రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధి బృందానికి అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమిటీ ప్రతినిధులు సార నరేందర్, నక్క నాగరాజు, వరగంటి శివుడు, సార లక్ష్మణ్, దిలీప్ , రాజ భార్గవ్ గణేష్ మన్నే రఘు , జయ ప్రకాష్ గణేష్ లక్ష్మణ్ స్థానిక గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

అందోల్, జోగిపేటలో ఘనంగా బోనాల ఉత్సవాలు

- హాజరైన మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బిక్షపతి





నవతెలంగాణ-జోగిపేట

బోనాల ఉత్సవాలలో భాగంగా మంగళవారం అందోల్, జోగిపేట మున్సిపల్ పట్టణాలలో ప్రజలు బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జోగిపేటలోని జోగిపేట తూర్పు గౌని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికి బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయన మహంకాళి అమ్మవారు ప్రతిమకు ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం పోచమ్మ దేవాలయం వరకు బోనాల ఊరేగింపు నిర్వహించారు. అందోల్ గ్రామంలో పోచమ్మ దేవాలయం వరకు బోనాల ఊరేగింపు నిర్వహించారు. రాష్ట్ర మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పు గౌని ముదిరాజ్ సంఘం నాయకులు డీబీ. నాగభూషణం, చాపల వెంకటేశం, కొత్త శ్రీనివాస్, నార్సింగి సాయిబాబా, వెంకటేశం, ధర్మేందర్, అంతం దానయ్య, శ్రీనివాస్, అరిగే వెంకటేశం, ప్రకాష్, అయ్యప్ప రాధాకృష్ణ, యాదగిరి, మాజీ ఎంపీపీ రామ గౌడ్, కౌన్సిలర్ భవాని నాగరత్నం గౌడ్, నాయకులు ఫైజల్, నాగరాజు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో మహిళా హక్కులపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవాధిరాన సంస్థ సెక్రటరి, సీనియర్ జడ్జి రమేశ్



నవతెలంగాణ-జోగిపేట

గ్రామస్థాయిలో మహిళా హక్కులపై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ జడ్జ్ రమేష్ అన్నారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాదికర సంస్థ, జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం అధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల స్పెషల్ సంయుక్త అవగాహన కార్యక్రమం అంగన్వాడీ కార్యకర్తలకు, మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు లింగ నిర్ధారణ జరగకుండా చూడాలని, బాలబాలికలకు సమాన అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సమాన హక్కులు కలిగి ఉన్నారని ఆయన తెలిపారు. ప్రతి చట్టం, హక్కులపై గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి తెలియజేయాలని సూచించారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ గ్రామంలోని పిల్లల ఆరోగ్య, విద్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. కిశోర బాలబాలికలను గమనించినట్లయితే వెంటనే కౌన్సిలింగ్ అందించాలని తెలియజేశారు. పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించాలని తెలియజేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని కె.లలిత కుమారి మాట్లాడుతూ పిల్లలకు పిల్లలకు ఉన్న ప్రతి సేవలను అందించాలని గ్రామంలో బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా , హెల్ప్ లైన్ నంబర్స్ 181,1098 గురించి వివరించాలని తెలియజేశారు. చదువుతోపాటు రక్షణ విషయంలోనూ అవగాహన అవసరం అని సూచించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట సిఐ అనిల్ కుమార్, సి డి పి ఓ ప్రియాంక,ఎంపిడిఓ రాజేష్ ,మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎస్సై పాండు, మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి,డీసీపీఓ రత్నం,సూపర్వైజర్ లు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు బడ్జెట్లో నిధులు పెంచాలి

- కేవీపీస్ జిల్లా కార్యదర్శి అశోక్



నవతెలంగాణ, జోగిపేట

హాస్టల్ విద్యార్థులకు రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి. అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో జోగిపేట పట్టణంలోని ఎస్సీ బాలుర ఏ, బి వసతి గృహాలలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో హాస్టల్ విద్యార్థులకు బడ్జెట్‌ను పెంచాలని, విద్యార్థులకు పాత భవనాల స్థానంలో అన్ని హంగులతో నూతన భవనాలను నిర్మించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఇచ్చే మెనూ కూడా పెంచాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమైనందున ట్రంక్ బాక్సులు, దుప్పట్లు, బట్టలు, నోట్ పుస్తకాలు, వెంటనే ఇవ్వాలని, కాలేజీ హాస్టల్ విద్యార్థులకు ప్యాకెట్ మనీ వెయ్యి రూపాయలు ప్రతినెల ఇవ్వాలని, సంక్షేమ హాస్టల్లో నిర్వహణ కోసం ప్రత్యేక నిధిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి. రాజు, జిల్లా కమిటీ సభ్యులు గంగారం, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించిన ఎస్పీ



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో రాణించడంతో శారీర దృఢత్వంతో పాటు ఆత్మరక్షణ ఏర్పడుతుందని, పోటీల్లో వచ్చే మెడల్స్, సర్టిఫికెట్లు ద్వారా క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని, మహిళలకు ముఖ్యంగా ఆత్మ రక్షణ విద్య చాలా అవసరమని జిల్లా ఎస్పీ రూపేష్ అన్నారు. హైదరాబాద్ యూసుఫ్ గూడ లో గల కోట్ల విజయభాస్కర రెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ టోర్నమెంట్లో జిల్లాకు చెందిన 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో అండర్ 9 స్పారింగ్ విభాగంలో రిత్విక్, హాసిని, సాహితి, భవజ్ఞ, అద్విక్ మాథ్యూ, రిదిక, అండర్ 12 లో సాయి చరణ్, వజ్రాంక్, విశ్వేశ్వర్, భరణికార్తీక్, ప్రణవ్ సాయి, హరిణ్య పాటిల్, శివతేజ, శ్రీ హర్షిత్, రఘు వంశీ, మహేష్ కుమార్, శ్రీమాన్విక్, అమోఘ్, సుశాంత్, ఋషి వర్ధన్ లు పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రూపేష్ పథకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ కోచ్, వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ పోచయ్య, మాస్టర్లు మహేష్ గౌడ్, రాజు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికులకు జీతాలు చెల్లించాలి

నవ తెలంగాణ-న్యాల్‌కల్

చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు జీతాల కోసం, తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టనున్నారు. మిషన్ భగీరథ కార్మికులు ఐదు నెలలుగా మిషన్ భగీరథ పనిచేసే కార్మికులు జీతాలు లేక అవస్థలు పడుతున్నట్టు ఈఎస్ఐ పిఎఫ్ ఐడి కార్డులు చెల్లించాలని సమ్మె బాటకు సిద్ధమైనట్లు కార్మికులు గోపాల్ రెడ్డి. సురేష్ కృష్ణ బిచ్చప్పలు తెలిపారు.

రుణమాఫీ సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలి

- శంకరంపేట ఏడీఏ రాంప్రసాద్



నవతెలంగాణ-టేక్మాల్: టేక్మాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీకి సంబందించిన ఫిర్యాదులను, రైతు బీమా దరఖాస్తులను స్వీకరిస్తున్నారని శంకరంపేట ఏడీఏ రాంప్రసాద్ రుణమాఫీకి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న, వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి, సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. రైతువేదికలో మంగళవారం రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రభుత్వం రైతులకు మొదటి విడతలో ఒక కుటుంబంకి సంబంధించి రూ.లక్ష మాఫీ చేశారని తెలిపారు. లక్ష లోపు రుణం తీసుకొని మాఫీ కానీ రైతులు ఏవైనా సమస్యలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని కోరారు. కొత్తగా పాస్ బుక్ వచ్చిన రైతులు, గత ఏడాది రైతు బీమా నమోదు చేసుకోని రైతులు, 59 సంవత్సరాల లోపు ఉన్న రైతులు ఆగస్టు 4వ తేదీలోగా క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారిని కలిసి రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు స్వయంగా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి రైతు బీమా కొరకు దరఖాస్తు చేసుకోలన్నారు. రైతు బీమాలో తప్పుల సవరణకు ఈనెల 29 వరకు అవకాశం ఉందన్నారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న రైతులు మరల దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు.

12వ రోజుకు చేరిన రైతుల రిలే నిరాహార దీక్ష

సంఘీభావం తెలిపిన బీఎస్పీ నాయకుడు కూతాడి నర్సింలు



నవతెలంగాణ-నర్సాపూర్

కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్ట్ కాలువ నిర్మాణం చేపట్టొద్దని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కొండపోచమ్మ భూనిర్వాసితులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష 12వ రోజుకు చేరింది. అయితే మంగళవారం రిలే నిరాహార దీక్షలో బ్రాహ్మణపల్లి, పెద్ద చింతకుంట, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన రైతులు దీక్షలో కూర్చున్నారు. వీరికి బీఎస్పీ జిల్లా నాయకులు కూతాడి నరసింహులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపోచమ్మ భూ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు రైతులకు బీ.ఎస్.పీ మద్దతుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు నరసింహారెడ్డి, కొండల్, పోచయ్య, కొమురయ్య, సుధాకర్ రెడ్డి, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపల్లి ఎస్‌బీఐలో 371 మంది రైతులకు రుణమాఫీ



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయల లోపు రుణమాఫీలో భాగంగా మొదటి విడతలో 371 మంది రైతులకు రుణమాఫీ అయినట్లు ఎస్బిఐ బూరుగుపల్లి బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ బూరుగుపల్లి ఎస్బిఐ క్లస్టర్ పరిధిలో 1555 మంది రైతులు ఉండగా, లక్ష లోపు రుణమాఫీ అయిన లబ్ధిదారుల్లో ఒక కోటి 90 లక్షల రూపాయలు రైతుల ఖాతాలో జమైనట్లు మేనేజర్ శ్రీధర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణమాఫీ అయిన రైతులకు మళ్లీ రుణాలు సకాలంలో అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పోలీస్ స్టేషన్‌ను సందర్శించామన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ప్రజా సమస్యలపై అనునిత్యం శ్రమించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట సిఐ వెంకటరాజ గౌడ్, స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, రైటర్ వినోద్, పోలీస్ సిబ్బంది నారాయణ, సోహెల్, నవీన్, నాగరాజు, ఆమని, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

- టిప్పర్‌ను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు
- తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి



నవతెలంగాణ-మనోహరాబాద్

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మనోహరాబాద్ తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ నెల 17న మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులోని పారిశ్రామిక ప్రాంతంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో టిప్పర్ పట్టుబడింది. టిప్పర్ రిపేర్‌లో ఉండడంతో టిప్పర్‌ను అక్కడే ఉంచారు. కాగా టిప్పర్‌ను రిపేర్ చేయించిన అనంతరం సేఫ్ కస్టడీ కోసం మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాల్టా చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్టు తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



నవతెలంగాణ-చేగుంట

ఉమ్మడి చేగుంట మండలం మాసాయిపేట గ్రామ శివారులోని వడ్డెర కాలనీకి వెళ్లే రోడ్డు ముందు గుర్తుతెలియని వ్యక్తి సోమవారం అనారోగ్యంతో నడుచుకుంటూ వెళ్లి పడిపోయాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడని మాసాయిపేట పంచాయతీ సెక్రెటరీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చేగుంట ఎస్సై బాల్ రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతుని ఒంటిపై బ్లూ కలర్ తెలుపు రంగు గీతల షర్టు, బూడిద రంగు నైట్ పాయింట్, ఎడమ చేతికి స్టీల్ కడెం అలాగే రాగి ఉంగరం ఉందని పోలీసులు తెలిపారు. వ్యక్తిని గుర్తుపట్టిన వారు ఫోన్ నెంబరు 8712657936 కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని ఎస్ఐ తెలిపారు.

రుణమాఫీ చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



నవతెలంగాణ-నర్సాపూర్

రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటామని నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పల్ తుర్తి గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. నర్సాపూర్ పట్టణంలోని యూనియన్ బ్యాంకులో చిప్పల్ తుర్తి గ్రామానికి చెందిన 50 మంది రైతులు రుణం తీసుకోగా వారికి మంగళవారం రూ.60 లక్షల వరకు రుణమాఫీ అయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న తమ బ్యాంకు రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిందని సంతోషం వ్యక్తం చేశారు. రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల లక్ష్మణ్ గౌడ్, రైతులు ఉన్నారు.

అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందాలి

- రుణమాఫీ సమస్యలపై గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు పగడ్బందీగా చర్యలు
- బూరుగుపల్లి ఎస్బిఐ బ్రాంచ్ వద్ద రుణమాఫీపై సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్
- రుణమాఫీ అమలుపై హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ - హవేలి ఘనాపూర్

మెదక్ జిల్లాలో పటిష్ట ప్రణాళిక నడుమ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ పథకం జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకు అమలవుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ సంబంధిత లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో కలిసి హవేలీ ఘనాపూర్ మండలంలోని బూరుగుపల్లి ఎస్బిఐ బ్రాంచ్ వద్ద రుణమాఫీ పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బ్రాంచ్‌లో 391 అకౌంట్లు ఉన్నాయని, ఇప్పటివరకు 367 మంది రైతులకు రుణమాఫీ అమలైందని తెలిపారు. రైతు రుణమాఫీపై క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకుని తద్వారా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సంబంధిత రైతులకు రైతు రుణమాఫీ సొమ్ము చేరేలా బ్యాంకులు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. రైతుల రుణ భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో అమలు జరగాలన్నారు. బకాయిలు ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రుణమాఫీ జరుగుతుందన్నారు. రుణమాఫీ జరగలేదని ఎవరు అధైర్య పడవద్దని విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణ మాఫీ ప్రక్రియ పూర్తి చేయాలని బ్యాంకు మేనేజర్‌లు, వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహమూర్తి, బూరుగుపల్లి ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్, సంబంధిత వ్యవసాయ అధికారి నాగ మాధురి మండల ఏఈఓలు స్వాతి, రాకేష్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వ్యాధుల నిర్మూలన కోసం ఆరోగ్య శిబిరాల ఏర్పాటు
- ప్రత్యేక ఆరోగ్య శిబిరం, పారిశుధ్యం పనుల పరిశీల
- డిఎం హెచ్ఓ, డిఎల్‌పిఓ



నవతెలంగాణ-చేగుంట

వర్షాకాల సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యాలను కాపాడుకోవాలని డీఎంహెచ్ఓ శ్రీరామ్ పేర్కొన్నారు. చేగుంట మండలం జైత్రం తండా గ్రామపంచాయతీ పరిధిలో వర్షాకాల సీజనల్ రోగాల నిర్మూలన కోసం ప్రత్యేక పారిశుద్ధ్యం పనులు, అలాగే ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాట్లను మంగళవారం మండల ప్రభుత్వ వైద్యాధికారి అనిల్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఇదే గ్రామంలో డెంగ్యూ కొద్దిపాటి లక్షణాలు కనిపించడంతో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం చుట్టు పరిసరాలను పరిశీలించి కొన్ని ఇండ్ల ముందు నిల్వ ఉన్న నీటిని, పాత టైర్లు వాటినన్నిటిని ట్రాక్టర్ సహాయంతో తొలగింప చేశారు.గ్రామంలో సుమారు 20 మంది బ్లడ్ శాంపిల్స్ తీసుకొని ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజలందరూ వర్షాకాల సీజన్లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ నీరు నిలవ ఉండకుండా చుట్టు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో దోమలు వృద్ధి చెంది అవి కాటేసినప్పుడు డెంగ్యూ, మలేరియా ఇతర వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. కాచి వడపోసిన నీటిని తాగాలని, వ్యక్తిగత శుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. డి ఎల్ పి ఓ యాదయ్య మాట్లాడుతూ గ్రామాలలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఈ వర్షాకాల సీజన్లో కీలక పాత్ర పోషించి ప్రజల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని వారికి సరైన చికిత్స అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి ఎస్. ఎల్లం, మక్కరాజుపేట కార్యదర్శి నగేష్, సోమలతండ కార్యదర్శి కుమార్, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది, పాల్గొన్నారు.

జాబ్ మేళా విజయవంతం

- ప్రిన్సిపల్ హుస్సేన్



నవతెలంగాణ-మెదక్ టౌన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టిఎస్ కే సి, ఇండస్ ఇండ్ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో కామర్స్ విభాగం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైనదని ప్రిన్సిపల్ హుస్సేన్ తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు జీవన నైపుణ్యాలపైన అవగాహన కలిగించి వారికి వివిధ రంగాలలో ఉద్యోగాలు లభించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాబ్ మేళాలో పాల్గొన్న అభ్యర్థులను ఉద్దేశించి ఇండస్ ఇండ్ బ్యాంకు హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ శ్యామ్ మాట్లాడుతూ లోన్ ఆఫీసర్‌కు ఉండాల్సిన అర్హతల గురించి సమగ్రంగా వివరించారు. బ్యాంకు మేనేజర్ గోవర్ధన్ మాట్లాడుతూ ఈ అవకాశం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చక్కని అవకాశంగా ఉందన్నారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు వివిధ రకాల ఇన్సెంటివ్స్ కూడా ఉంటాయని తెలిపారు. సుమారు వందమంది వరకు అభ్యర్థులు ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. వీరిలో తగిన అర్హతలు ఉన్న 22 మంది అభ్యర్థులను ఎంపిక చేసి లోన్ ఆఫీసర్లుగా నియమించనున్నట్లు తెలిపారు. వీరికి తగిన శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తామన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన నియామకాలు సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో టీఎస్‌కేసి సమన్వయకర్త ప్రవీణ్ కుమార్, కామర్స్ ఇంచార్జ్ శాఖాధిపతి డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ తిరుమల రెడ్డి, డాక్టర్ దినకర్, శ్రీనివాస్, క్రాంతి కిరణ్, హరిత, నిదర్శిని, శేఖర్, అంజయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తున్న జిఎంఆర్

- జిఎంఆర్ పోచంపల్లి హైవేస్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ




నవతెలంగాణ-మనోహరాబాద్

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సంస్థ కృషి చేస్తుందని జిఎంఆర్ పోచంపల్లి హైవేస్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల పరిధిలో గల కూచారం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయానికి జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆటోమేటిక్ స్కూల్ రింగ్ బెల్, గ్రీన్ బోర్డ్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి వెంకటరమణ ముఖ్య అతిధిగా విచ్చేసి స్కూల్ ఆటోమేటిక్ రింగ్ బెల్, గ్రీన్ బోర్డ్స్ పాఠశాల సిబ్బందికి, విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం జి.యం.ఆర్ సంస్థ కృషి చేస్తుందని తెలియ జేశారు. ఆ తరువాత విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు . జి.యం.ఆర్ సంస్థ వారికీ పాఠశాల ప్రత్యేక అధికారి కృష్ణ తేజ, పాఠశాల ఉపాధ్యాయ బృందం. విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిది శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జి.యం.ఆర్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలి

సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ- గజ్వేల్

సిద్దిపేట జిల్లాలో కార్మిక రాజ్య బీమా సంస్థ ఈఎస్ఐ డిస్పెన్సరీలు లోకల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ గజ్వేల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈఎస్ఐ ఇన్సూరెన్స్ పర్సన్స్ సుమారు 5వేల మందికి పైగా కార్మికుల పని చేస్తున్నారన్నారు. జిల్లాలో సిద్దిపేట ప్రాంతంతో పాటు గజ్వేల్‌లోని ములుగు, మర్కుక్. గజ్వేల్, వర్గల్ మండలాల్లో అనేక పరిశ్రమలు ఉన్నాయని వాటి పరిధిలో వేలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ప్రయివేట్ పాఠశాల్లోని టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, అనేక సంస్థల్లో పని చేస్తున్న కార్మికులు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, జిల్లాలోని మున్సిపల్ కార్మికులు ఈఎస్ఐ పరిధిలో ఉన్నారని కార్మికుల, ఉద్యోగుల వేతనాల నుంచి ఈఎస్ఐకి ప్రతినెల లక్షల జమవుతున్నాయని అన్నారు. కానీ కార్మికులకు మాత్రం ఈఎస్ఐ ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. తక్షణమే గజ్వేల్‌లో, సిద్దిపేట పట్టణంలో ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఈఎస్ఐ లోకల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక కార్మికులు, వారి కుటుంబ సభ్యులు నిత్యం అనేక జబ్బులు, ప్రమాదాలు జరిగినా స్థానికంగా డిస్పెన్సరీ లేకపోవడంతో ఈఎస్ఐని వాడుకోవడం లేదని అన్నారు. ప్రతి నెల డబ్బులు కటింగ్ అవుతున్న అనారోగ్యం కలిగినప్పుడు తిరిగి ప్రయివేట్ ఆసుపత్రిలో వెళ్ళవలసి వస్తుందన్నారు. రెండు విధాలుగా ఆర్థికంగా నష్టపోవడంతో పాటు సెలవులు కూడా వినియోగించుకోలేని పరిస్థితిని ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాట్ల కోసం ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాలు కార్మికుల రక్షణ కోసం, భద్రతా సౌకర్యాల గురించి పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈఎస్ఐ ద్వారా అనేక సదుపాయాలు ఉన్న ఈఎస్ఐ లోకల్ కార్యాలయం స్థానికంగా లేకపోవడంతో వాటన్నిటినీ కార్మికుల కోల్పోతున్నారని అన్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ కోసం లోకల్ కార్యాలయం కోసం భవిష్యత్తులో సీఐటీయూ చేసే పోరాటాలలో కార్మికులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సురేష్ సద్దాం, అశోక్, సుధాకర్, రాజు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం. కుంగుతున్న రోడ్డు

- ప్రారంభానికి ముందే రోడ్డుకు మరమ్మతులు
- ప్రశ్నార్థకంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు నాణ్యత,
- రూ.2.5 కోట్లతో రోడ్డు నిర్మాణం
- కాంట్రాక్టర్ల చేతివాటంతో ప్రజాధనం వృథా
- రోడ్డు కుంగడంతో వాహనదారులు పరేషాన్





నవతెలంగాణ-నార్సింగి

అధికారుల బాధ్యతారాహిత్యం, కాంట్రాక్టర్ల చేతి వాటంతో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు నిర్మాణం అభాసు పాలవుతోంది. రూ.2.5 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణం పూర్తి కాకముందే, మరమ్మతులకు గురికావడం గమనార్హం. ప్రజాధనం దుర్వినియోగమయ్యేలా సాగిన రోడ్డు పనులపై అధికారుల పర్యవేక్షణ అసలే లేకపోవడంతో ప్రారంభానికి ముందే శిథిలమవుతోంది. కుంగి పోతున్న రోడ్డు ఆర్‌అండ్‌బీ అధికారుల పని తీరును ప్రశ్నిస్తుండగా కాంట్రాక్టర్ చేతి వాటానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న తీరు పట్ల సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. నార్సింగి మండలంలో రోడ్లు, భవనాల శాఖా ఆధ్వర్యంలో 2020 సెప్టెంబర్ 16న రూ.2.53 కోట్ల వ్యయంతో శంకుస్థాపన జరిగిన రోడ్డు నిర్మాణంలో నాణ్యత నగుబాటుకు గురవుతోంది. ఈ రోడ్డు ప్రారంభానికి నోచుకోక పోగా, నిర్మాణ దశలోనే కుంగిపోవడం గమనార్హం. ఈ రోడ్డు నిర్మాణం లో కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శించి, నాణ్యతకు తిలోదకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అధికారులు సైతం అందినంత దండు కొని నాణ్యతను పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బీటీ రోడ్డుకు పగుళ్లు

మండల కేంద్రమైన నార్సింగి నుంచి శంకరంపేటకు వెళ్లే బీటీ రోడ్డును దాదాపు రూ.13 కోట్లతో చేపట్టగా, రోడ్డు అభివృద్ధి పనులకు రూ.2.53 కోట్లను నాటి ప్రభుత్వం మంజూరు చేసి, ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ఈ పనులను చేపట్టారు. ఈ నేపథ్యంలోనే కాంట్రాక్టర్లు పూర్తి నాసిరకంగా రోడ్డును నిర్మించినట్లు తెలుస్తోంది. ఈ రోడ్డు మధ్యలోని గన్నేరు వాగు వద్ద చేపట్టిన బ్రిడ్జి వద్ద నిర్మాణంలో పగుళ్లు ఏర్పడటంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. రోడ్డు ప్రారంభోత్సవానికి నోచుకోక ముందే పగుళ్లు ఏర్పడటంతో వాహన దారులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలోనే రోడ్డు కుంగి పోగా, మరమ్మతులు చేపట్టడం గమనార్హం.

శాస్త్రవేత్తల సూచనలు పాటించి రైతులు అధిక దిగుబడి పొందాలి

- రైతు వేదిక నందు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్
- వీక్షించిన వ్యవసాయ అధికారులు, రైతులు







నవతెలంగాణ-మనోహరాబాద్

రైతు నేస్తం కార్యక్రమంలో శాస్త్రవేత్తలు తెలిపిన సూచనలు పాటించి రైతులు అధిక దిగుబడులను పొందాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ రైతులకు సూచించారు. మంగళవారం మనోహరాబాద్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆయిల్ ఫాం పంటలవైపు వెళ్లాలని దాంతో అధిక దిగుబడులు వచ్చి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. దాంతో పాటు రైతులు రసాయనిక ఎరువులను కాకుండా సేంద్రీయ ఎరువులతో పంటలను పండించాలని సూచించారు. సేంద్రీయ ఎరువులతో భూ సాంద్రతపెరిగి పంటలు బాగా పండుతాయని రైతులకు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ముఖ్యంగా పత్తిపంటలు, పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు తీసుకునే జాగ్రత్తలపై సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారి ప్రవంతి, ఏఈవోలు సచిన్, నరెందర్‌గౌడ్‌లతో పాటు మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ - నార్సింగి

మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ మహాదేవప్ప, డాక్టర్ కిరణ్ బాబు, వర్షాకాలంలో పంటల రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అదేవిధంగా భారీ వర్షాల నేపథ్యంలో పంట పొలంలో మురుగు నీరు నిల్వ లేకుండా అరికట్టడం, చీడపీడల నివారణ కోసం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారినులు విజృంభన, దివ్య, ఫామ్ ఆయిల్ ఫీల్డ్ ఆఫీసర్ ఉదయ్ కిరణ్, రైతులు పాల్గొన్నారు

నవతెలంగాణ-వెల్దుర్తి

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వివిధ పంటల యజమాన్యం, వాటి సస్యరక్షణపై మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక నందు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సేద్య విభాగ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ జి మహాదేవప్ప, డాక్టర్ టి కిరణ్ బాబు, డాక్టర్ బి రామ్ ప్రసాద్, వరి పరిశోధన స్థానం రాజేంద్రనగర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పంటల యజమాన్యం సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు పుణ్యవతి, సాయికుమార్, వందన, గౌతమి, రేవతి, ఉత్తం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజల ప్రభుత్వం కాదు, బాకీలు పడ్డ ప్రభుత్వం

- బీఎస్పీ మండల అధ్యక్షులు టప్ప బానుచందర్



నవతెలంగాణ-చేగుంట

అబద్దాలతో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ అవే అబద్దాలతో పాలన కొనసాగిస్తుందని బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు టప్ప భానుచందర్ ఆరోపించారు. చేగుంట మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీపై ప్రభుత్వం గోబల్స్ ప్రచారం చేసుకుంటుందని, రైతు రుణమాఫీ మార్గదర్శకాలను మార్చాలని డిమాండ్ చేశారు. రూ.6 వేల కోట్లతో రుణమాఫీ పూర్తయిందన్నారు. లక్ష రూపాయల రుణం మాఫీ చేశామని చెబుతూ రూ.2 లక్షలు మాఫీ చేసినట్లు ప్రకటన ఇవ్వడం తగదన్నారు.యాసంగి రైతుబంధులోనే రూ.2 వేల కోట్లు ఎగ్గొట్టారన్నారు. రైతుభరోసా ప్రకారం చూస్తే రూ.6 వేల కోట్లు ఎగ్గొట్టారని వానాకాలం రైతు భరోసా ఊసే లేదన్నారు. కోటి 30 లక్షల ఎకరాలకే ఇస్తారనుకున్నా రైతులకు ఎకరాకు రూ.7500 చొప్పున రూ.10 వేల కోట్లు ఎగ్గొట్టారన్నారు. 40 లక్షల మంది ఫించను దారులు, దివ్యాంగుల ఏడు నెలలుగా నెలకు రూ.2 వేల చొప్పున బాకీ పడిందని ఆరోపించారు. 30 లక్షల మంది నిరుద్యోగులకు ఏడు నెలలుగా నెలకు రూ.4 వేల చొప్పున బాకీపడిందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదని, బాకీలు పడ్డ ప్రభుత్వమని ఎద్దేవా చేశారు.

మోడీ నాయకత్వంలో అన్ని రంగాల్లో దేశాభివృద్ధి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కరణం పరిణత



నవతెలంగాణ పెద్దశంకరంపేట్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యురాలు కరణం పరిణిత అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విట్టల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మోడీ నాయకత్వంలో ప్రపంచ దేశాలు మొత్తం భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. ప్రధానమంత్రి మోడీ ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ఆమె వివరించారు. యువత మహిళలు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వం నడుస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విట్టల్, మండల బీజేపీ నాయకులు బండల శ్రావణ్ కుమార్ మంగలి కృష్ణ బుగుడాల కృష్ణ, గంగారెడ్డి సాయిలు అంజయ్య విజయ్, సత్యనారాయణ, సుభాష్, రమేష్, రాజు సురేందర్ ఆయా గ్రామాల బూత్ స్థాయి అధ్యక్షులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

వాణిజ్య వ్యాపార తాపీ మేస్త్రీలకు అవగాహన



నవతెలంగాణ-నిజాంపేట

అత్యుత్తమ కట్టడాలకు ప్రతిష్టమైన సిమెంట్ ఎంపీ బిర్లా సిమెంట్ అని ఆ కంపెనీ జిల్లా టెక్నికల్ ఆఫీసర్ భానుచందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం నిజాంపేట మండల కేంద్రంలో వాణిజ్య వ్యాపారస్తులు, తాపీ మేస్త్రీలకు సిమెంట్ నాణ్యత వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ బిర్లా సిమెంట్ చాలా ధృఢత్వాన్ని కలిగి ఉంటుందన్నారు. కట్టడాలు త్వరగా పూర్తి అవుతాయని పర్యావరణానికి మరింత అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ పన్యాల వెంకటరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నాయిని లక్ష్మణ్, ప్రశాంత్,వేణు, భాస్కర్,అంజా గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సిద్దిపేట
బుధవారం | 24 జులై 2024 | www.navatelangana.com

రుణమాఫీ కాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

-మద్దూరు ఏవో రామకృష్ణ

నవతెలంగాణ-మద్దూరు



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రైతు రుణమాఫీకి సంబంధించి తమ సందేహాలను రైతులు నివృత్తి చేసుకోవాలని. రుణమాఫీ కాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మద్దూరు ఏవో రామకృష్ణ అన్నారు. దూల్మిట్ట మండలంలోని రైతు వేదికలో రైతులకు రైతు రుణమాఫీ సందేహాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష లోపు పంట రుణం తీసుకొని వుండి రుణమాఫీ లిస్టులో పేర్లు రాని రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. 2018 డిసెంబర్12 నుంచి 2023 డిసెంబర్ 9 ఏళ్లల్లో వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకొని రెన్యువల్ చేసిన, చేయని రైతులు కూడా తప్పకుండా రుణమాఫీ పథకం వర్తిస్తుందన్నారు. అసలు వడ్డీ కలిపి రూ.లక్ష దాటిన వారికి రెండో విడతల్లో మాఫీ అవుతుందన్నారు. రుణమాఫీ కానీ రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి పట్టాదార్ పాస్బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాధిక, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- పత్తి నర్సింలు యాదవ్

నవతెలంగాణ-మర్కుక్



ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దామరకుంట కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలల్లోనే ప్రజా సంక్షేమం కోసం రూ. వేల కోట్ల ఖర్చు చేశారని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న కాంగ్రెస్ పార్టీ పై ప్రతిపక్షాలు విమర్శించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీలో రూ.పది లక్షల పెంచారన్నారు. రైతు రుణమాఫీ చేసిన సీఎం రెవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అంగడి కిష్టాపూర్ నూతన కార్యదర్శిగా సిద్దేశ్వర్

నవతెలంగాణ-మర్కుక్



మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ పంచాయతి నూతన కార్యదర్శిగా పంచెద్దుల సిద్దేశ్వర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత కార్తదర్శిగా విధులు నిర్వహించిన నిలీమా ఇప్పలగూడెం బదిలీ అయ్యారు. చేబర్తి పంచాయతి కార్యదర్శిగా విధులు నిర్వహించిన సిద్దేశ్వర్ బదిలీ పై అంగడికిష్టాపూర్‌కు వచ్చారు. అంగడికిష్టాపూర్ మాజీ సర్పంచ్ దుద్దెడ రాములు గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నూతనంగా భాధ్యతలు తీసుకున్న సిద్దేశ్వర్‌ను శాలువతో సన్మానించారు. అనంతరం సిద్దేశ్వర్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధి తమవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో దిండిగల్ మీసాల శ్రీనివాస్ రెడ్డి, మన్నె అంజనేయులు, రాపోలు సుదర్శన్ గౌడ్ , మహేశ్, తదితరులున్నారు.

పద్మశాలి సంఘం ఎన్నికలకు నామినేషన్లు దాఖలు

-గజ్వేల్‌లో మొదలైన నామినేషన్ దాఖలు పర్వం

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పద్మశాలి సంఘం ఎన్నికల సందర్భంగా మంగళవారం పద్మశాలి భవనంలో నామినేషన్ దాఖలు చేసిన పలువురు నాయకులు, స్థానిక కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం నామినేషన్ దాఖలు చేశారు. అక్కడి నుంచి పద్మశాలి సంఘం అధ్యక్ష పదవికి గాడిపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్ష పదవికి తలకొక్కుల ప్రేమ్ కుమార్, సహాయ కార్యదర్శి సబ్బని నరేష్ , కోట కిషోర్, నామినేషన్ దాఖలు చేశారు. ఎలక్షన్ కమిటీ సభ్యులు తలకొక్కుల రాజు, గాడి పల్లి భాస్కర్, రామచంద్రం, దేవదాస్ తెలిపారు. అనంతరం గాడిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో నేను అధ్యక్షునిగా పనిచేసిన సమయంలో పద్మశాలి సంఘం ఫంక్షన్ హాల్‌లో ఏ రకంగా అభివృద్ధి చేసినట్టు గుర్తు చేశారు. పద్మశాలి కుల బంధువులు, మిత్రులు అందరికి తెలుసు కాబట్టి, పద్మశాలి సంఘం అభివృద్ధి కోసం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ఫంక్షన్ హాల్ పూర్తి చేస్తానని, పద్మశాలి కుల బంధువుల సంక్షేమం కోసం పనిచేయడానికి సిద్ధంగా ఉన్న నన్ను అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సీనియర్ నాయకులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు

కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేయాలి

నవ తెలంగాణ - సిద్దిపేట

జిల్లాలో పది నెలల నుంచి షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీ చెక్కులు సుమారు మూడు వేల వరకు పెండింగ్‌లో పేరుకుపోయాయని, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వాటిని వెంటనే చెల్లించాలని సిద్దిపేట బీఆర్ఎస్ బీసీ సెల్ కోఆర్డినేటర్ ముదిగొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో బడుగు, బలహీన వర్గాల నిరుపేద బీసీలు బాకీలు చేసి వారి కూతుర్ల వివాహాలు జరిపించి కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ డబ్బుల కోసం సుమారు 15 నెలల నుంచి ఎదురుచూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలో నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం మాని, నిరుపేదలకు చెక్కులు పంపిణీ చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పై చేసిన మూడు నెలలకే చెక్కులు ఇచ్చేదని, లబ్ధిదారులకు ఎంతో ఊరటగా ఉండేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి చెక్కులు పంపిణీ చేయడంలో అలసత్వం వీడకపోతే లబ్ధిదారులతో కలసి ఆర్డీవో ఆఫీసును ముట్టడిస్తామని తెలిపారు.

మేరు కులస్తులను బీసీ ఏ లోకి మార్చాలి

నవతెలంగాణ-నంగునూరు

బట్టలు కుట్టుడే జీవనాధారంగా పెట్టుకున్న మేరు కులస్తులను బీసీడీ నుంచి బీసీఏలోకి మర్చాలని నంగునూరు మండలంమేరు సంఘం అధ్యక్షుడూ అన్న రాజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నంగునూరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు అందించే దుస్తులను కుట్టడానికి ప్రభుత్వ స్కూళ్ల యూనిఫామ్స్, కుట్టు మిషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా మేరు కులస్తూలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి అన్నిరకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మేరు సంఘం ఉపాధ్యక్షులు కీర్తి అంజయ్య, కోషధికారులు కీర్తి ప్రవీణ్, గూడూరు యాదగిరి, కార్యవర్గ సభ్యులు కీర్తి రాజు, కీర్తి పోచయ్య, కీర్తి నాగరాజు, గూడూరి బేగిరావు, కీర్తి బాలరాజు, కీర్తి శ్రీధర్, కాటారం శివ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలి డబ్బులతో స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-ములుగు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్అండ్ఆర్ కాలనీ తునికి బొల్లారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎస్ కవితా దేవి పాఠశాల విద్యార్థిని, విద్యార్థులందరికీ తమ సొంత డబ్బుతో ఏకరూప దుస్తులు (స్పోర్ట్స్ దుస్తులు) ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు రూ.70 వేలతో కొనుగోలు చేసి విద్యార్థినీ విద్యార్థులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలుని ఘనంగా సన్మానించారు. కవిత మాట్లాడుతూ సరైన దుస్తులు కూడా కొనలేని పేద విద్యార్థులను చూస్తే ఎల్లప్పుడూ ఏదో ఒక సహాయం చేయాలని మనస్సులో ఉండేదని తన జన్మదినం సందర్భంగా ఈ విద్యార్థులందరికీ దుస్తులు ఇవ్వాలని ఆలోచన వచ్చిందని వెంటనే దాన్ని ఆచరణలో పెట్టానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు

నవతెలంగాణ-సిద్దిపేట



ఓటు హక్కు లేదని విద్యార్థులపై రాష్ట్రప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడు నెలల నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం పంపిణీ చేస్తున్న బియ్యం బాగుండడం లేదని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మధు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రభుత్వ ప్రైమరీ హై స్కూల్‌లను సందర్శించి విద్యార్థులతో, మధ్యాహ్న భోజన కార్మికులతో, ఉపాధ్యాయులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఒక్కో విద్యార్థి పై వేలల్లో ఖర్చుపెడుతున్నాం అని చెప్తున్న రాష్ట్ర ప్రభుత్వం, వాటిని సరిగ్గా ఖర్చు పెడితే ఇంతకంటే గొప్ప మార్పులను చూడవచ్చని అన్నారు. స్కూళ్లలో స్కావెంజర్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి, పూర్తిస్థాయిలో విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రావణ్, వినయ్, రవి, కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మద్దూరు



మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో మద్దూరు మాజీ జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశంతో కలిసి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి నాయకుని నుంచి ఎంపీగా ఎదిగిన వ్యక్తి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇలాంటి వేడుకలు నిండు నూరేళ్లు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండి శ్రీనివాస్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు గుండెగోని లలిత మల్లేశం, మాజీ సర్పంచులు కూకట్ల బాలరాజు యాదవ్, రామడుగు బాలరాజు, పంగ పరుశరాములు, మాజీ ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్ రెడ్డి, నాయకులు దాసరి పద్మా రెడ్డి, సత్యనారాయణ గౌడ్, రమేష్, కనక చంద్రం, పుల్లూరి రాజు, నీరటి కిషోర్, ప్రకాశం, ఫసి అహ్మద్, కృష్ణ, మల్లేష్, గొట్టే పర్తి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్కు పెట్టేది ఎప్పుడు?

నవ తెలంగాణ- గజ్వేల్

రోజురోజుకు ట్రాఫిక్ సమస్యలు గజ్వేల్‌లో ఎక్కువవుతున్నాయి. ట్రాఫిక్ సమస్యకు చెక్కు పెట్టేది ఎలా అని సంబంధిత శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రోడ్లు విస్తరించిన ట్రాఫిక్ సమస్య యధా విధంగా ఉండడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. పట్టణంలో ఉన్న షాపుల ముందు ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీల్స్ నిలపడంతో రాకపోకలకు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంద్ర పార్క్ నుంచి కోట మైసమ్మ రోడ్డు, అదేవిధంగా గజ్వేల్ నుంచి సంగాపురం, ముట్రాజ్‌పల్లి, పిడిచెడు, ప్రజ్ఞాపూర్ వెళ్లే రోడ్లు పై వాహనాలు నిలవడంతో ప్రయాణికులకు, ప్రజలకు తలకు మించిన భారముగా మారింది. గజ్వేల్ పట్టణంలో బుధవారం సంత నిర్వహిస్తుండగా బస్సులకు, కార్లకు, లారీలకు, డీసీఎంలకు, ఫోర్ వీల్స్‌కు వెళ్లాలంటే కష్టంగా ఉంది. రోజుకు 25 వేల మంది రాకపోకలు సాగిస్తున్నట్లు సమాచారం. ఇందులో ప్రభుత్వం, జూనియర్ కళాశాలల విద్యార్థులు సుమారు పదివేల మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే కాకుండా వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి గజ్వేల్ పట్టణానికి మరో పదివేల మంది వరకు వస్తున్నారు. సుమారు రాకపోకలు 50 వేల మంది నిత్యం సాగిస్తున్నట్లు సమాచారం. వ్యాపారం కేంద్రంగా గజ్వేల్ అభివృద్ధి చెందడంతో అనుగుణంగా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు వ్యాపారులకు అవగాహన కల్పించారు. రోడ్లపై గంటల తరబడి వాహనాలు నిల్వరాదని దీంతో ప్రజలకు ఇబ్బంది అవుతుందని చెప్పారు.

రోడ్డుపైన పార్కింగ్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రస్తుతం 55 వేల జనాభా ఉండగా రాకపోకలు మరో 50 వేలమంది సాగిస్తుండడంతో ఇరుకైన పట్టణంగా ఉండడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత పదేండ్లుగా కొంతవరకు అభివృద్ధి జరగడంతో ఇతర ప్రాంతాల వారు బ్రతుకుతెరువు కోసం నిత్యం పట్టణానికి కూలి పనుల కోసం వస్తున్నారు. అంతేకాకుండా విద్య, వాణిజ్యపరంగా, వ్యాపార రంగాలు పెరిగాయి. దీంతో పట్టణానికి వ్యాపారానికి వచ్చే క్రయ విక్రయాలకు వచ్చే వాహనాలు రోడ్డుపై పెట్టడం వల్ల పార్కింగ్ రోడ్డుపైనే ఉంటుంది.

వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఉన్న..

వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఉన్న కూరగాయల వ్యాపారులు స్థానిక ఇంద్ర పార్క్ నుంచి కోట మైసమ్మ రోడ్డు మార్గమునా డిల్లీ వాలా హెూటల్ వరకు కూరగాయలను ఒకపక్క ఏర్పాటు చేసుకోగా మరోపక్క చిరు వ్యాపారులు తోపుడు బండ్లను ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రజలకు, పాదాచారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పోలీసులు ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నప్పటికి సమస్య పరిష్కారం కావడం లేదు. మార్కెట్‌లో వ్యాపారులు కూరగాయలు విక్రయించకుండా రోడ్లపై విక్రయిస్తున్నారు. మార్కెట్లో గిరాకీ కావడం లేదని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు గజ్వేల్‌లో విక్రయించుకొని వెళ్ళిపోతున్నారని తాము తెచ్చుకొన్న కూరగాయలు మార్కెట్ లోనే కుళ్లిపోతున్నాయని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.

రోడ్డుకెక్కిన రేకుల షెడ్లు.

గజ్వేల్ పట్టణంలో వ్యాపారులు తమ దుకాణం ముందున్న సామాగ్రి వర్షాకాలం, వేసవికాలంలో తుప్పు పట్టకుండా దుకాల ముందు రేకుల షెడ్లు రోడ్డుపైకి వేస్తున్నారు. దీంతో దాని కింద వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. సగం రోడ్డు వరకు ఆక్రమంకు గురవుతుంది. ఇలా గజ్వేల్ నుంచి ప్రజ్ఞాపూర్, పిడిచెడు, కోట మైసమ్మ, సంగాపూర్ తదితర మార్గాల్లో వ్యాపారు వేసుకున్నారు. పోలీసులు వారం క్రితం పిలిచి రేకుల కొట్టాలు తీయాలని సూచించారు. కానీ



ఎవరు కూడా రేకుల కొట్టాలని తీయడం లేదు. గతంలో మున్సిపల్ సిబ్బందితో తొలగింపు చర్యలు చేపట్టారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం ఒకటే..

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్ శాశ్వత పరిష్కారానికి రింగురోడ్ పూర్తయింది తప్ప చేసేది ఏమీ లేదని ప్రజాప్రతినిధులు అధికారులు చెప్తున్నారు. గత ప్రభుత్వంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ గజ్వేల్ రింగ్ రోడ్డు కోసం రూ.230 కోట్ల నిధులు మంజూరు చేయగా 23 కిలోమీటర్ల రింగ్ రోడ్డు పనులు చివరి దశలో ఉన్నాయి. దాదాపు 95 శాతం పనులు పూర్తికాగ మూడు చోట్ల మాత్రమే పనులు నిలిచి ఉన్నాయి. ఈ పనులు పూర్తి చేస్తే గజ్వేల్ పట్టణానికి వచ్చే భారీ వాహనాలు రింగురోడ్డు మార్గాల ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో ట్రాఫిక్ తగ్గుతుందని పోలీసు, ఇతర శాఖ అధికారులు భావిస్తున్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త





నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ డివిజన్ ఎపెడమిక్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం డ్రై డే, ఫ్రైడే కార్యక్రమంలో భాగంగాగజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 16వ, వార్డులో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు పట్ల జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ కౌన్సిలర్ తలకొక్కుల భాగ్యలక్ష్మీ దుర్గ ప్రసాద్ అన్నారు. భూపతిరావు నగర్, బెంగళూరు కాలనీ, కుమ్మరివాడ, యాదగిరి థియేటర్ నుంచి బాలాజీ ఎంక్లేవ్, సత్య సాయిబాబా టెంపుల్ సిరి ఎన్క్లేవ్‌లో మురికినీటి కాలువలలో మురికినీటి గుంటలోనూ దోమలు లార్వాలను నిర్మూలించుటకు డెమో ఫాస్ మందును పిచికారి చేసినట్లు కౌన్సిలర్ తెలిపారు. ఇంటింటికి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోని ఆరోగ్యంగా ఉండాలన్నారు. చిన్న దోమే కదా ఈగలే కదా అని లైట్ తీసుకుంటే పెద్ద పెను ప్రమాదం పొంచి ఉందని అన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని లేదంటే కలరా, టైఫాయిడ్ , మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, చికెన్ గునియా, డెంగ్యూ సోకే ప్రమాదం ఉందని ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీళ్ల నిలువ లేకుండా మురుగునీటి కాలువలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లయితే విష జ్వరాలు రాకుండా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చా అన్నారు. గజ్వేల్ డివిజన్ ఎపిడెమిక్ సెల్ సభ్యులు దేవసాని వాసుదేవ్ మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లో తిరిగి సీజనల్ వ్యాధులు పట్ల విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని, ప్రతి ఒక్కరికి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ ఎపిడమిక్ సేల్ సభ్యులు డి. నాగరాజు, కె.దుర్గా గౌడ్, ఫీల్డ్ వర్కర్ ఎన్.రమేష్ మున్సిపాలిటీ సిబ్బంది సపాయి బాలయ్య, సత్తయ్య ప్రవీణ్, ఆశ వర్కర్లు శ్యామల, రాధిక సుల్తానా బేగం పాల్గొన్నారు.

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య పరిధిలోని పాలమాకుల గ్రామంలో మంగళవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయ హెచ్ఈ సత్యనారాయణ అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించి మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే నిర్వహించి దోమల నివారణకు సహకరించాలని కోరారు. దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యాతో పాటు తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో కొబ్బరి చిప్పలు, కూలర్లు, టైర్లు, పాత సామాన్లు, ప్లాస్టిక్ వస్తువుల్లో ఉన్న నీటి నిల్వ వల్ల వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. గ్రామాల్లో వర్షాల వల్ల జ్వరాలు వచ్చే ప్రమాదమునందున వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఉచిత వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందరికీ వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఓ స్వామి, సూపర్వైజర్ అనురాధ, స్థానిక హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

అక్రమదారుల నుంచి ప్రభుత్వ భూమి కాపాడాలి

- పంచాయితీ కార్యదర్శికి ఫిర్యాదు

నవతెలంగాణ-బెజ్జంకి



బెజ్జంకి మండల పరిధిలోని గూడెం గ్రామంలోని సర్వే నంబర్ 321 యందు ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న దాదాపు 7 ఏకరాల భూమిలో గ్రామంలోని కొందరు అక్రమదారులు అక్రమ నిర్మాణాలు చేపట్టడానికి సమాయత్తమవుతున్నారని ప్రభుత్వ భూమిని కాపాడాలని పలువురు గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు జారీ చేసే ప్రక్రియను నిలిపివేయాలని పంచాయతీ కార్యదర్శి లావణ్యకు పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. తప్పుడు ధృవపత్రాలతో ప్రభుత్వ భూమిని అక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టడానికి కొందరు గ్రామస్తులు యత్నిస్తున్నారని జిల్లాధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టి భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గజ్వేల్ ఎమ్మెల్యే అసెంబ్లీకి వెళ్ళాలి

- ప్రజా సమస్యలు చర్చించాలి

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ ఎమ్మెల్యే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభ సమావేశాలకు వెళ్లాలని గజ్వేల్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నక్క రేగొండ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్‌లో నెలకొన్న సమస్యలపై అసెంబ్లీలో కేసీఆర్ చర్చించాలని కోరారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులు కొన్ని నిలిచిపోయాయని వాటికోసం నిధులు తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి మొదటగా ఏర్పాటు చేసిన శాసనసభ సమావేశాలకు ఆరోగ్యపరంగా సమస్యలు వచ్చాయని అందుకు శాసనసభకు వెళ్లడం లేదని చెప్పిన కేసీఆర్ ఈ శాసనసభ సమావేశాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గజ్వేల్ రింగ్ రోడ్డుకు, కోట మైసమ్మ రోడ్డుకు అదేవిధంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అనేక రోడ్లు మట్టి రోడ్లు ఉన్నాయని వర్షాలకు ఇబ్బంది అవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేసీఆర్ స్పందించి ఎమ్మెల్యే కోట కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. స్థానిక ప్రజల సమస్యలను ఎమ్మెల్యే పట్టించుకోవాలని చెప్పారు. గజ్వేల్ ప్రజలతో ఓట్లు వేయించుకొని వ్యవసాయ క్షేత్రంలో ఉండటం కన్నా గజ్వేల్లో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు వస్తే ప్రజలు సమస్యలు చెప్పుకుంటారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వరంగా మారినట్లు పేర్కొన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి నాయకత్వంలో కలిసికట్టుగా పనిచేయాలని వచ్చే అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని కోరారు.

గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో కదిరే కృష్ణపై ఫిర్యాదు

- కదిరే కృష్ణ చిత్ర పటం దహనం

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్‌లో కదిరే కృష్ణ మీద చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ హైందవ సోదరులు అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద కదిరే కృష్ణ చిత్రపటం దహనం చేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయం చైర్మన్ బుక్క రమేష్, పురోహితులు నంద బాల శర్మ, శేషం శ్రీనివాస చార్యులు మాట్లాడుతూ హిందూ దేవతల మీద, కలియుగ వైకుంఠం శ్రీ వేంకటేశ్వరుని మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కదిరే కృష్ణను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే హిందువుల జోలికి, హిందూ దేవతల జోలికి ఎవరైనా వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

పిల్లలను ఆకర్షించేల పాఠశాలను తీర్చిదిద్దాలి

- పాఠశాల సందర్శనలో కలెక్టర్ మను చౌదరి
- పునః ప్రారంభానికి కృషి చేసిన కారోబార్‌కు కలెక్టర్ అభినందనలు
- పాఠశాల మరమ్మత్తులకు నివేదిక అందించాలని ఏఈ సమ్మయ్యకు ఆదేశాలు

నవతెలంగాణ-బెజ్జంకి



గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ విద్యను పటిష్ట పర్చి నాణ్యమైన విద్యనందించడమే ప్రధాన లక్ష్యంగా మూతపడి తిరిగి పునః ప్రారంభించుకున్న పాఠశాలలపై ప్రత్యేక చొరవ చూపి పిల్లలను ఆకర్షించేల రంగులతో, చిత్రాలతో పాఠశాలను తీర్చిదిద్దాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి విద్యాశాఖ అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పోతారం గ్రామంలో పునః ప్రారంభమైన ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ మను చౌదరి సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం గ్రామస్తులు త్రాగు నీరు, మూత్రశాలలు, ప్రహరి గోడ నిర్మాణం, విద్యుత్, కిటికీలు, ప్రధాన గేట్ ఏర్పాటుచేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. పాఠశాల మరమ్మత్తు పనులకు నివేదిక రూపొందించి అందజేయాలని పంచాయితీ రాజ్ శాఖ ఏఈ సమ్మయకు కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. అక్షరాలతో పదాలను రూపొందించిన విద్యార్థులను అభినందించి పెన్నులు అందజేశారు. మరో విద్యార్థి పుట్టిన రోజు సందర్భంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ విష్ణు వర్ధన్, పీఆర్ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈ మహేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ప్రత్యేకాధికారి రేణుకా, సెక్టోరియల్ అధికారి రామస్వామి, రంగనాథ్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, జీవన్ రెడ్డి, మునీరుద్దీన్, గ్రామస్తులు హజరయ్యారు.

కారోబార్‌ను అభినందించిన కలెక్టర్

గత 15 ఏళ్లుగా మూతపడిన పాఠశాలను గ్రామంలోని పిల్లల తల్లిదండ్రులు, అధికారులను సమన్వయపర్చి తిరిగి పాఠశాల పునః ప్రారంభానికి కృషి చేసిన కారోబార్ బాబును కలెక్టర్ మను చౌదరి అభినందించారు. పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలను పెంచాలని సూచించారు.

రైతు బంధు అమలు చేయరా?

- మహిళలకు తులం బంగారం మర్చిపోయారా?
- బీఆర్ఎస్ నాయకులు గుంటుక రాజు

నవతెలంగాణ-గజ్వేల్



కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని పాతర వెయ్యాలని చూస్తుందని రైతు బంధు అమలు చేయరా? గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు గుంటుక రాజు అన్నారు. మంగళవారం ఆయన ఇంటిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల జరిగి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రైతు బంధు అమలుకు నోచుకోలేదన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రభుత్వం గారడి చేస్తుందని విమర్శించారు. అదేవిధంగా మహిళలకు కళ్యాణ్ లక్ష్మీ, షాది ముబారక్ పథకాలతో పాటు ప్రతి పెళ్లి చేసుకున్న యువతీయులకు తులం బంగారం పెట్టి మేనమామ అవుతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు వేలాది పెండ్లి చేసిన యువతుల తల్లిదండ్రులు పథకం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హాయంలో ఏ పథకం కోసం ప్రజలు ఎదురు చూడలేదని స్పష్టం చేశారు. గతంలో కేసీఆర్ కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకాలను సకాలంలో అమలు చేయడం వల్ల వేలాది పేద కుటుంబాలకు కొంత భారం తప్పిందని గుర్తు చేశారు. తులం బంగారం ఇస్తానంటే 18 ఏండ్లు నిండిన యువతులు ఓట్లు కాంగ్రెస్కు వేశారని ఒక్కసారి ప్రభుత్వం గుర్తు తెచ్చుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వంలో వృద్ధులకు, వితంతులకు రూ.2 వేల పెన్షన్ అమలు చేసిందని డిసెంబర్ 9 నుంచి రూ.4 వేల పెంచుతామని సీఎం మాయమాటలు చెప్పినట్లు విమర్శించారు. దీంతో వృద్ధులు మహిళలు, వితంతులు కాంగ్రెస్కు ఓట్లు వేశారని గుర్తు చేశారు. పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ప్రజలు ఊరుకునే సమస్యలేదని ప్రజల పక్షాన పోరాటం సాగిస్తామని పేర్కొన్నారు.

రైతులతో ఫిక్స్ డిపాజిట్లు చేయించటం సరికాదు

- మాఫీ ఐన రైతులకు మొత్తం డబ్బులు ఇవ్వాలి
- సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి

నవతెలంగాణ - కొమురవెల్లి



రుణమాఫీ జరిగిన రైతుల నుంచి బ్యాంక్ అధికారులు ఫిక్స్ డిపాజిట్లు చేయించడం సరికాదని సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంక్ ముందు బ్యాంకు అధికారులు ఫిక్స్ డిపాజిట్లు చేయించడాన్ని నిరసిస్తూ రైతులతో కలిసి ధర్నా నిర్వహించి బ్యాంక్ అధికారులకు వినతి పత్రం అందించారు. అనంతరం సత్తిరెడ్డి మాట్లాడుతూ రుణమాఫీ జరిగిన రైతులు బ్యాంకులో డబ్బులు తీసుకోవడానికి వస్తే వాళ్లను బలవంత పెడుతూ బ్యాంకు అధికారులు ఫిక్స్ డిపాజిట్లు చేయించుకుంటున్నారని తెలిపారు. అప్పు మాఫీ కావడంతో పెట్టుబడుల కోసం డబ్బులు తీసుకువెళ్తున్న రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని బ్యాంక్ అధికారులను హెచ్చరించారు. ఎలాంటి షరతులు లేకుండా మాఫీ జరిగిన రైతులకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, నాయకులు బక్కెల్లి బాలకిషన్, తాడూరి మల్లేశం, ఉల్లంపల్లి సాయిలు, నీల బిక్షపతి, ఆరుట్ల రవి, తాడూరు మహేందర్, కానుగుల రాజు, రాజేశం, నరెడ్ల నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా మురుగునీరుతో రైతుల ఇబ్బందులు

నవతెలంగాణ-మద్దూరు



మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల మురుగునీరుతో పంటలు వేసుకో లేకపోతున్నామని ఇరు మల్ల రమేష్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ పాఠశాల వెనుకనే తన వ్యవసాయ భూమి ఉన్నదని తెలిపారు. తన వ్యవసాయ భూమిలో ఏ పంట సాగుచేసిన పాఠశాల నుంచి మురుగునీరు రావడంతో కూలీలు సైతం తమ వ్యవసాయ భూమిలోకి రావడం లేదని, కూలీలు రాకపోవడంతో పంటను అలాగే వదిలిపెట్టవలసి వస్తుందని తెలిపారు. మురుగునీరు ఎక్కువగా రావడంతో తానే రూ.2వేలతో జేసీబీతో పాఠశాలలో గుంత తీయించానని ఐనా మురుగునీరు ఆగడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పాఠశాల మురుగునీరు తమ వ్యవసాయ పొలంలోకి రాకుండా ఇంకుడు గుంతలు నిర్మించాలని కోరారు.

రుణమాఫీతో ప్రతి రైతు కళ్ళలో ఆనందం

- డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి



నవతెలంగాణ-కొండపాక

సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేయడంతో రైతుల కళ్ళల్లో ఆనందం కలిగిందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి అన్నారు. కొండపాక పీఏసీఎస్ వద్ద మంగళవారం రుణమాఫీ సంబరాలు చేశారు. అనంతరం సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచిందని అన్నారు. కొండపాక పీఏసీఎస్‌లోని 464 మంది రైతులకు రూ. 1.94 కోట్ల రుణమాఫీ అయిందన్నారు. రుణమాఫీ పొందిన రైతులకు మళ్ళీ క్రాప్‌లోని ఇస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు నడుస్తున్న రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, సురేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగారావు, నాయకులు మల్లేశం, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసే విధంగా కేంద్ర బడ్జెట్

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి



నవ తెలంగాణ -గజ్వేల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుద్యోగులను మోసం చేసే విధంగా ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి విమర్శించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగాన్ని పరిష్కరించే పేరుతో బడ్జెట్‌లో జిమ్మిక్కులకు పూనుకుందని, నైపుణ్య శిక్షణ కేంద్రాలలో కొత్త ఉపాధిని సృష్టించే పేర్లతో కార్పొరేట్లకు సబ్సిడీ ఇచ్చే మరో మార్గంగా ఉందన్నారు. గతంలో నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా యువత 18 శాతం కు మించి ఉద్యోగాలు రాలేదని దేశంలో నిరుద్యోగం పెరుగుతూనే ఉందని మరోసారి నిరుద్యోగులను మోసం చేసే విధంగా ఈ బడ్జెట్ ఉందని అన్నారు.

కార్పొరేట్ శక్తులను సంతృప్తిపరిచిన బడ్జెట్

- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



నవతెలలగణ-సిద్దిపేట అర్బన్

పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలు కార్మికులు మధ్యతరగతి ప్రజలపై భారాలు వేసి కార్పొరేట్ శక్తులను సంతృప్తిపరిచేదిగా ఉందని ఇది పూర్తిగా పేదలకు వ్యతిరేకమైన బడ్జెటని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి అన్నారు. మంగళవారం పార్లమెంటులో ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా సమస్యలను పక్కకు పెట్టి కేవలం కార్పొరేట్ శక్తులకు పెట్టుబడుదారులకు లాభాలు చేకూర్చే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని విమర్శించారు. స్వయంగా ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో నిత్యవసర సరుకుల ధరలు 3.8 శాతం నుంచి 7.5 శాతానికి పెరిగిందని చెప్పారని, బడ్జెట్లో పెరిగిన ధరలకు అనుగుణంగా ఆహార భద్రతకు గ్యారెంటీ కల్పించలేదని ప్రజలకు ఆహార భద్రతను పూర్తిగా విస్మరించారన్నారు. ఉపాధి హామీ పథకానికి గత ఏడాది కేటాయించిన రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించారని పెరిగిన బడ్జెట్ కనుగుణంగా కనీసం 10శాతం కూడా బడ్జెట్ పెంచలేదని ఇప్పుడున్న పరిస్థితుల్లో రూ.2 లక్షల కోట్ల ఉపాధి హామీ పథకానికి కేటాయించాల్సి ఉండగా 86 వేల కోట్లతో సరిపుచ్చారని, ఇది ఉపాధిని హరించడమే తప్ప మరొక్కటి కాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మూడు కోట్ల ఇండ్లను పేదలకు నిర్మించి ఇస్తామని చెప్పి 54 వేల కోట్లు గతంలో బడ్జెట్లో కేటాయించి కేవలం 32 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఈ బడ్జెట్లో కూడా మళ్లీ 54 వేల కోట్లు కేటాయించి ఇండ్లు నిర్మించేస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడం తప్ప మరొక కాదని ఈ బడ్జెట్ కేటాయింపులు చూస్తుంటే పేదల ఇంటి కల నెరవేర్చే పరిస్థితి లేదని అన్నారు. బడ్జెట్లో విద్యా వైద్యం సేవా రంగాలకు నిధులు పెంచలేదని ప్రత్యేకంగా విద్యా వైద్య రంగానికి ప్రజలకు సేవలు అందించే మౌలిక రంగాలకు బడ్జెట్లో కేటాయింపులు జరపడంలో తీవ్ర అన్యాయం జరిగిందని ఇది పేదల బడ్జెట్‌గా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను విడనాడి ప్రజా అనుకూల బడ్జెట్ను రూపొందించాలని డిమాండ్ చేశారు

ఏపీ రాష్ట్రం విశాఖపట్నం జిల్లాకు చెందిన దంపతులకు అధికారికంగా దత్తతను ఇచ్చినారు

- జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్



నవతెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

సిద్దిపేట జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆడ శిశువును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లాకు చెందిన దంపతులకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ చేతుల మీదుగా అధికారికంగా దత్తతను ఇచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్ తల్లిదండ్రులతో మాట్లాడుతూ అమ్మాయిని బాగా చదివించాలి. తనకు ఇష్టమైన రంగంలో ప్రోత్సహం ఇవ్వాలి. అమ్మాయి బంగారు భవిషత్‌కు బాట వేసే పూర్తి బాధ్యత మీదే అని చెప్పారు. జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో వున్న శిశు గృహ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సీఎచ్ శారద, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి, శిశు గృహ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ పూర్ణబోధకు "బాలకళాశ్రీ" పురస్కారం



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన మాస్టర్ పూర్ణబోధను జాతీయస్థాయిలో బాలలకు అందజేసే ప్రతిష్టాత్మక "బాలకళాశ్రీ" అవార్డు వరించింది. సంస్కార భారతి జాతీయ సాంస్కృతిక సంస్థ, నవకళాభారతి సంయుక్తంగా టీ.వీ రంగయ్య సారధ్యంలో షాద్‌నగర్ పట్టణంలో ఈ నెల 21వ, 22వ తేదీలలో జాతీయస్థాయి బాలల నాటకోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షులు టీ.వీ రంగయ్య మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా కళలకు, సాహిత్యానికి, సంగీతానికి విశేష సేవలందిస్తున్న జాతీయస్థాయి బాల కళాకారులకు ప్రోత్సాహంగా బాలకళాశ్రీ పురస్కారాలను ఈ జాతీయస్థాయి బాలల నాటకోత్సవాలలో అందిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రముఖ సినిమా డబ్బింగ్ బాల కళాకారుడు, బాలనటుడు మాస్టర్ పూర్ణ బోధను "బాలకళాశ్రీ" పురస్కారంతో సత్కరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిధులుగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, శ్రీవర్ధన్ రెడ్డి, ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్ట్ ఆర్.సి.ఎమ్ రాజు, జబర్దస్త్ ఫేమ్ సునామి సుధాకర్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మీ శివకుమార్, మునిసిపల్ చైర్మెన్ కే నరేందర్, మాజీ చైర్మెన్ విశ్వం, డాక్టర్ వాద్రేవు శివాజీ, ఆకెళ్ళ శివప్రసాద్, సినినటుల అంజి, జబర్దస్త్ కొమరం, మురళిశర్మ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో వేరువేరుగా ఎంపీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-చేర్యాల

మంగళవారం మండల కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు ఆధ్వ ర్యంలో, పాత బస్టాండ్ వద్ద కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు ఆధ్వర్యంలో భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి వేరువేరుగా ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థానం కమిటీ తాజా మాజీ అధ్యక్షుడు పర్పాటకం లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షులు ఆడెపు చంద్రయ్య, ముస్త్యాల కిష్టయ్య, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, నల్ల పోచమ్మ దేవస్థానం కమిటీ చైర్మెన్ గూడెపు మహేష్, తడక లింగం గుప్తా, జిల్లా రాజేశం, దాసరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. పాత బస్ స్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ కాటం మల్లేశం, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి. కాజా, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అయిత శ్రీనివాస్, తుమ్మలపల్లి శ్రీనివాస్, ఎలుగల దుర్గయ్య బుట్టి యాదగిరి, ఎలుగల రాజు, పోతుగంటి ప్రసాద్, తుమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎర్రపప్పు గింజలతో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రం



నవ తెలంగాణ- గజ్వేల్

మంగళవారం చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఎర్రపప్పు గింజలను ఉపయోగించి ఆజాద్ చిత్రాన్ని అత్యంత అద్భుతంగా చిత్రించి, ఘన నివాళులు అర్పించి దేశభక్తిని రామకోటి రామరాజు చాటుకున్నారు. శ్రీ రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న కళారత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ అంటే చరిత్ర కాదు భారతీయ యువత త్యాగాలకు ప్రతిరూపం అన్నారు. స్వరాజ్యేచ్ఛతో 15 ఏళ్ళ వయస్సులోనే స్వతంత్ర సంగ్రామంలోకి అడుగిడి చంద్రశేఖర్ ఆజాద్గా మారి, 24 ఏళ్ళ వయసులోనే దేశం కోసం అమరుడైన ఆ మహనీయుని బాటలో నడవాలన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత అందరిది

- మున్సిపాల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో నాలుగో వార్డులో వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత మా ట్లాడుతూ పట్టణంలో వివిధ వార్డులో నాటిన మొక్కలను వార్డు ప్రజలు సంరక్షణ చేయడంలో భాగస్వాములు కావాలన్నారు. వార్డులోని కుండలలో, టైర్లలో, ఇంటి పరిసరాలలో నిల్వ ఉన్న వాటర్‌ను తొలగించాలని సూచించారు. స్ప్రే, బ్లీచింగ్ చల్లడం, మిని వాటర్ ట్యాంక్ వద్ద శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ ఐలేని అనిత రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణాధికారి రవికుమార్, వార్డ్ ఆఫీసర్ వెంకటేష్, వార్డ్ ఆర్పి శోభ, అంగన్వాడీ టీచర్, ఆశా కార్యకర్త మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని ప్రకారం బడ్జెట్ లేదు



నవ తెలంగాణ -గజ్వేల్

48.21 లక్షల కోట్లతో కేంద్రబడ్జేట్ ప్రవేశపెడితే తెలంగాణకు కేటాయించింది గుండుసున్న అని, ఉపాధి హామీలో పనిదినాల ప్రకారం బడ్జెట్ లేదని డిబీఫ్ నాయకులు దాసరి ఎగొండ స్వామి అన్నారు. మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, బీహర్ మినహిస్తే మిగిత 26 రాష్ట్రాలకు ప్రాదన్యత ఇవ్వకపోవడం బాధకరం అన్నారు. ఉపాధి హామీలో పనిదినాల ప్రకారం కేటాయింపు లేదన్నారు. 2020-21 బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ. 61.5వేల కోట్లు కేటాయించగా, 2021-22, 2022-23 బడ్జెట్‌లో రూ.70 వేల కోట్లు, 2023-24 బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించారు. ప్రస్తుత బడ్జెట్‌లో కూడా రూ.86 వేల కోట్లు కేటాయించింది. కానీ 2023-24 కి ఐన ఖర్చు 1.05వేల కోట్లు ఖర్చుతో పొల్చుకుంటే 19.3వేల కోట్లు తక్కువగా బడ్జెట్ కేటాయింపులు జరిగినట్లు తెలిపారు. గత ఏడాది కంటే మెదటి మూడు నెలలలో 5.74 కోట్ల పనిదినాలు నిర్వహించినట్లు చెప్పారు. పని దినాల ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరగాలని కోరారు.

గడ్డం బాలకిషన్‌కు సన్మానం



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలోని పబ్లిక్ సర్వెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా ఎన్నికైన గడ్డం బాలకిషన్‌ను సోమవారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు అంజయ్య, ప్రధాన కార్యదర్శి విక్రం రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు, పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ల జీవనోపాదికి ప్రాధాన్యత ఉంటుంది

- జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపట కలెక్టరేట్

ట్రాన్స్ జెండర్ల జీవనోపాధి కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ, అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ట్రాన్స్ జెండర్ లకు స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పవర్ స్విచ్ ఎకో సంస్థ ప్రతినిధి అక్షయ్ నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వివక్షతను ఎదురుకాకుండా తమ కాళ్లపై తాము నిలబడేందుకు ట్రాన్స్ జెండర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి కావలసిన ఇష్టమైన రంగాలలో ఉపాధిని కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. జిల్లాలో దాదాపు 100 మందికి పైగా ట్రాన్స్ జెండర్లు ఉన్నారని, వ్యక్తిగతంగా ఎవరికి ఇష్టమైన ఉపాధి యూనిట్‌ను నిర్ణయించుకుంటే అందజేస్తామని లేక అందరికీ కలిపి ఒకే పనిలో ఉపాధి పొందాలనుకుంటే వ్యవసాయ అనుబంధ రంగాలు లేక ఇతర రంగాల్లో ప్రత్యేకమైన ఉపాధి యూనిట్‌ను ప్రారంభించి ఉపాధి కల్పిస్తామని అన్నారు. డీఆర్డీఏ ద్వారా కూడా పాడి ఆవుల పెంపకం, పౌల్ట్రీ పామ్, క్యాంటీన్ నిర్వహణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, ఈవెంట్ మేనేజ్మెంట్, బ్యూటీ పార్లర్, మిల్క్ పార్లర్ లాంటి యూనిట్ల ద్వారా అవకాశాలను కల్పిస్తామని అన్నారు. ట్రాన్స్ జెండర్‌లకు ప్రత్యేక ఇండ్లు లేనందున వారికి ఇండ్ల స్థలాలను అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ధనవంతులకు లాభసాటిది

- పేదలకు పూర్తిగా వ్యతిరేకమైన బడ్జెట్
- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.భాస్కర్



నవ తెలంగాణ- దుబ్బాక

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా పేద ప్రజల వ్యతిరేకమైన బడ్జెట్ అని, ఇది కార్పొరేట్ ధనవంతులకు లాభసాటి, అనుకూలమైన బడ్జెట్ అని, సీపీఐ ఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.భాస్కర్ విమర్శించారు. గత ఏడాది బడ్జెట్‌తో పోలిస్తే ఈ బడ్జెట్‌లో భారీ కోతలు విధించారని, దీంతో దేశంలో దారిద్రం పెరిగి ఆకలి చావులు పెరిగే ప్రమాదం ఉందని మండిపడ్డారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలిక కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్ పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పోషకాహార లోపం పెరగడానికి కారణం అవుతుందని విమర్శించారు. గ్రామీణ స్థాయిలో ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో పూర్తిగా కోతలు పెట్టిందని, దీనివల్ల నిత్యం శ్రమ చేసుకునే కార్మికుల వలసలు పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది రూ.44 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వం ఈసారి రూ.48.21లక్షల కోట్లు కేటాయించిందని 10 శాతం పెరిగిన బడ్జెట్ గతంలో ఉన్న కేటాయింపుల పైన కూడా 10 శాతం పెరగాల్సింది పోయి ఉన్న బడ్జెట్ ను తగ్గించే ప్రయత్నం చేశారని విమర్శించారు. గతంలో మూడు కోట్ల ఇండ్లు ఆవాస్ యోజన కింద నిర్మిస్తామని ప్రకటించి రూ.55 వేల కోట్లు ప్రకటించి రూ.34 వేల కోట్లు ఖర్చు మాత్రమే చేశారని, అది 45 శాతం మాత్రమే ఈసారి కూడా మళ్లీ అదే పరిస్థితి చేశారని విమర్శించారు. అంగన్వాడీలో పోషకార లోపాన్ని అధిగమించేందుకు గతంలో రూ.21,527 కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.21.2 వేల కోట్లు మాత్రమే కేటాయించడం ఈ పోషకార లోపాన్ని అధిగమించడానికి కాకుండా పోషక లోపంతో బాధపడే ప్రజల సంఖ్య పెంపుదల చేయడానికి దోహదపడుతుందని విమర్శించారు. ముఖ్యంగా విద్యా, వైద్యానికి సంబంధించిన బడ్జెట్ గతంతో పోలుస్తే ఈసారి మరింత తగ్గిందని విద్యకు గతంలో 4.1 శాతం కేటాయించిన బడ్జెట్ ను ఈసారి 3.06 శాతానికి తగ్గించిందని విమర్శించారు. వైద్య రంగానికి కూడా విస్మరించిందన్నారు. ఈ బడ్జెట్ వలన విదేశీ పెట్టుబడుదారులను ఆహ్వానిస్తూ విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారుల, లాభాల కోసం బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయే తప్ప సాధారణ ప్రజానీకానికి అవసరం కోసం ఈ బడ్జెట్ కనబడలేదని విమర్శించారు. 2014లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చి పదేండ్లు ఐన ఒక్క ఉద్యోగం కల్పించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఐదేళ్లలో నాలుగు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగ యువతను మరోసారి మోసం చేసే పద్ధతుల్లో బడ్జెట్లో ప్రకటన చేయడం తప్ప మరోటి లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి ప్రజాసంక్షేమం కోసం సాధారణ ప్రజల సంక్షేమం కోసం రైతుల, శ్రామికుల సంక్షేమం కోసం ఈ బడ్జెట్‌లో మార్పులు చేయాలని బడ్జెట్ ఆ విధంగా ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేనియెడల భవిష్యత్తులో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బత్తుల రాజు, ఎండి సాజిద్, మల్లేశం, మెరుగు రాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా పథకంతో రైతుకు ధీమా

- దౌల్తాబాద్ ఏవో గోవిందరాజ్




నవ తెలంగాణ- రాయపోల్

రైతు బీమా పథకంతో రైతులకు ఎంతో ధీమాగా ఉంటుందని, రైతు బీమా పథకానికి అర్హులైన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని దౌల్తాబాద్ ఏవో గోవిందరాజు అన్నారు. మంగళవారం దౌల్తబాద్ మండలంలో రైతు బీమా నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతు బీమాలేని రైతులు రైతు భీమా పథకంలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట, దౌల్తాబాద్, ముబారాస్ పూర్, తిరుమలపూర్ గ్రామాల పరిధిలో గల రైతులు 2024-25 ఏడాదికి రైతు బీమా నమోదు కార్యక్రమం వ్యవసాయ విస్తరణ అధికారులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కొత్తగా వచ్చిన పట్టాదారు పాస్ బుక్ పొందిన రైతులు 18 నుంచి 59 ఏళ్లలోపు గల రైతులు బీమా దరఖాస్తు ఫారాన్ని నింపి దానితో పాటు, రైతు యొక్క ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాత బుక్ జీరాక్స్ పత్రాలు, మొబైల్ నెంబరు జతపరిచి రైతువేదికలలో ఏఈఓలకు అందజేయాలన్నారు. రైతులు అనుకోకుండా లేక ఏ కారణం చేత ఐనా మరణించినట్లయితే వారి కుటుంబాన్ని ఆదుకోవడం కోసం ప్రభుత్వం రూ.5 లక్షలు నామినీ బీమా పొందే అవకాశం ఉంటుంది అన్నారు. ఈ యొక్క బీమా గడువు ఆగస్టు 5 తేది వరకు కలదు. కావున అర్హులైన రైతులు వినియోగించుకోగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అంబటి రాజు గౌడ్, రైతులు, పాల్గొన్నారు.

చేనేత కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

- చేనేత రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో భారీ కేటాయింపులు ఉండాలి
- కర్రోళ్ల రవిబాబు



నవ తెలంగాణ- దుబ్బాక

రూ.2వేల కోట్లతో చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అలాగే చేనేత రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో భారీ కేటాయింపులు ఉండాలని ధర్మసమాజ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు డిమాండ్ చేశారు. నిరుద్యోగ చేనేత యువతకు, కార్మికులకు నిబంధన లేని రుణ సౌకర్యం కల్పించి టెక్స్ టైల్ రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని చేనేత సహకార సంఘాన్ని ఆయన సందర్శించారు. కార్మికులకున్న సమస్యల్ని అడిగి తెలుసుకొని, ఆయనమాట్లాడుతూ దుబ్బాక ప్రాంతంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న పద్మశాలీలు వేరే ఇతర జీవనోపాధి పనుల్లేక పూర్తిగా చేనేత రంగంపైనే ఆధారపడి ఉన్నారన్నారు. గత ప్రభుత్వాలు చేనేత రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల అనేకమంది చేనేత కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురై ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్నా రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో చేనేత రంగానికి పెద్దపీట వేసి భారీ బడ్జెట్ కేటాయింపులు చేయాలని రూ.50 లక్షల ఆరోగ్య భీమా, ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు సురేష్, బాలరాజు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలలోనే నాణ్యమైన విద్య

- ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి





నవతెలంగాణ-కోహెడ

ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని కాచాపూర్, సోమరంపల్లి, శనిగరం గ్రామాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ప్రాథమిక పాఠశాలలను, అంగన్వాడీ సెంటర్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులలో విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయుల బోధన, మధ్యాహ్న భోజన పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారని అందరూ శ్రద్ధగా చదివి ఫలితాల్లో 10 జీపీఏ తెచ్చుకోవాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని జిల్లాలో వెయ్యికి పైగా పాఠశాలలో త్రాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్, కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్లు, మైనర్ రిపేర్లు, తదితర పనులను సంపూర్ణంగా చేపట్టామన్నారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పిన కొన్ని ప్రభుత్వ పాఠశాలలు గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులు లేక మూతపడడం ఆందోళనకరమైన విషయమని కోహెడ, అక్కన్నపేట మండలాల్లో సుమారు 15 పాఠశాలలు మూతపడ్డాయని, మూతపడడానికి గల కారణాలు తెలుసుకొని తల్లిదండ్రులను మోటివేట్ చేసి విద్యార్థులను చేర్పించి వాటిని మళ్లీ తెరవడానికి విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కొన్ని పాఠశాలలలో ఇప్పటికే కొంతమంది విద్యార్థులు చేర్చడం జరిగిందని నాణ్యమైన ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, రెండు జతల యూనిఫామ్‌ను అందిస్తూ క్వాలిఫైడ్ టీచర్లచే విద్యా బోధన జరుగుచున్న ప్రభుత్వ పాఠశాలలకే తమ పిల్లలను పంపించాలని సూచించారు. సోమారంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు రాకపోవడం, అంగన్వాడీకి భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాల భవనంలో అంగన్వాడీ నడిపిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అంగన్వాడీ భవన నిర్మాణానికి, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కాచాపూర్ గ్రామంలో రెండేళ్లుగా మూతపడిన ప్రాథమిక పాఠశాలను తిరిగి పునరుద్ధరించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలలో కాంప్లెక్స్ హెచ్ఎం మహమూద్, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, కమ్యూనిటీ నోబలైజర్ పద్మయ్య, పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

నవ తెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో అభ్యసన సామర్ధ్యాల పెంపు పై మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ నోడల్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యను అందించుటకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అవసరమైన అన్ని మౌలిక వసతులను ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, ఇతర కార్యక్రమాల ద్వారా కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేస్తూ విద్యార్థులలో గుణాత్మకమైన అభ్యసన శక్తిని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులది, విద్యాశాఖ అధికారులదని అన్నారు. విద్యార్థుల అభ్యసన సమస్యల ప్రకారం ఏ, బీ, సీ గ్రూపులుగా వర్గీకరించి తక్కువ అభ్యసన సామర్ధ్యం గల విద్యార్థులపై ప్రత్యేక దృష్టించి, ఏ యే సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆయా సబ్జెక్టుల్లో అర్థమయ్యేలా ప్రత్యేక బోధన చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి కేస్ షీట్ రూపొందించి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించాలని అన్నారు. మార్కుల లక్ష్యంగా కాకుండా విజ్ఞానం లక్ష్యంగా బోధన చేస్తే ఆటోమెటిగ్గా పరీక్షల్లో ఉత్తమ ప్రదర్శన ప్రదర్శిస్తారని అన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులతో గేమ్స్ కమిటీ, డిబేట్స్ కమిటీ, కల్చరల్ కమిటీ, డ్రాయింగ్ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేసి ఆయా కమిటీలలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనేలా చేయాలని, ప్రభుత్వం అన్ని స్కూళ్ల లైబ్రరీలకు అనేక విజ్ఞాన పుస్తకాలను పంపించిందని వాటిని విద్యార్థులు ఉపయోగించుకునేలా చూడాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చూడాలని, అన్ని పాఠశాలలో టెస్ట్ బుక్స్ పంపిణీ చేసి వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని, మధ్యాహ్న భోజనం వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని అన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది రిజిస్టర్‌ను పక్కాగా మైంటైన్ చేయాలని అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌ని ఆదర్శంగా తీసుకొని అడ్మిషన్ కోసం పోటీపడేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి



నవతెలంగాణ - కొమురవెల్లి

పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) కొమురవెల్లి మండల నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గురువన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న నగవత్ బిక్షపతి, మండల ప్రధాన కార్యదర్శిగా కొమురవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్న గ్యార ప్రవీణ్ కుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ మహాసభ చింతల కనకయ్య అధ్యక్షతన జరిగిన మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన తప్పెట్ల యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న ఐదు డిఏలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో పాటు ఉద్యోగుల వేతనాల్లో పెంపు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందని గుర్తు చేశారు. 2023 జూలై 1 నుంచి అమలు చేయాల్సిన పీ ఆర్‌సీని కూడా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దేవులపల్లి గిరిబాబు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ జి.ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రచురణాల కమిటీ కన్వీనర్ ఈ తిరుపతి, జిల్లా ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కో కన్వీనర్ ఎం.శివుడు, జిల్లా కమిటీ సభ్యులు, కృష్ణంరాజు, ఎస్ బిక్షపతి, రమేష్, అర్పిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన



నవ తెలంగాణ - సిద్దిపేట

పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి పర్యటించారు. పట్టణంలోని ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని, వర్మి కంపోస్ట్ యార్డ్ పలు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వీధి కుక్కలు నివాసితులకు, రవాణా దారులకు ప్రధాన ఆందోళన కలిగిస్తున్నాయని అనేక ఫిర్యాదులు అందడంతో, సీఎం రేవంత్ రెడ్డి, సీడీఎంఏ ఆదేశాలమేరకు, చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు అనుమతితో ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించినట్లు తెలిపారు. 6వ వార్డులోని వర్మీ కంపోస్ట్ యార్డ్‌ని పరిశీలించినట్లు తెలిపారు. హౌజింగ్ బోర్డులో 12 ఫీట్ రోడ్డును ఆక్రమించి, మిషన్ భగీరథ పైప్ లైన్ పైన సిమెంట్ పలకలతో రోడ్డు ఆక్రమణ చేశారన్న ఫిర్యాదు మేరకు పరిశీలించారు. ఆక్రమణకు గురైనట్లైతే వెంటనే నోటీసులు జారీ చేసి తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. చౌడలమ్మ దేవాయలం నిర్మాణ పనులు పరిశీలించినట్లు తెలిపారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా నిర్మించిన మూత్ర శాలలను, నీటి ట్యాప్ ఏర్పాట్లను, విద్యుత్ పనులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఏఈలు రంజిత్, అన్వేష్ రెడ్డి,టీపీఓ దేవరాజు, సానిటరీ ఇన్స్పెక్టర్లు సతీష్, వనిత, మాధవి, బీఆర్ఎస్ నాయకులు పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌లో గ్రామాల పేర్లు తారుమారు



నవతెలంగాణ- గజ్వేల్

గ్రామాల్లో ప్లాట్లు, వ్యవసాయ భూములు, ఇల్లు రిజిస్ట్రేషన్ అయినప్పుడు ఒక గ్రామంలో ఉంటే మరో గ్రామం పేరు పెడుతున్నారని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్ కాంగ్రెస్ నాయకులు కన్న యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సురేష్ అన్నారు. మంగళవారం ప్రజ్ఞాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రియల్ వ్యాపారులు కొందరు ఈ దందాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజ్ఞాపూర్ గ్రామములో ఇల్లు ఉంటే ఇంటి నెంబర్ గుండన్న పల్లి ఉన్న ఇల్లు నంబర్ వేస్తున్నారని అదే విధంగా గుండన్నపల్లిలో ఉంటే ప్రజ్ఞాపూర్ గ్రామంలో ఉన్న ఇల్లు నెంబర్లు వేస్తున్నారని, ఇల్లు ఉంటే అందులోనుంచి రోడ్డు ఉందని డాక్యుమెంటల్‌లో సృష్టిస్తున్నారని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ అధికారులు ఇష్టాసారంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని విమర్శించారు. ప్రజ్ఞాపూర్ గ్రామంలో కొందరు వ్యక్తులు రియల్ వ్యాపారుగా మారి ఈ దందాలు చేస్తున్నారని విమర్శించారు. రిజిస్ట్రేషన్ అధికారులు పూర్తి సమాచారం తీసుకుని రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫర్టిలైజర్ షాప్స్‌ని తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-తూప్రాన్ 103



ఫర్టిలైజర్ షాప్స్‌ని తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి తూప్రాన్ పట్టణంలోని పలు దుకాణాల్లో అమ్ముతున్న ఫర్టిలైజర్స్ మందుల వివరాలను, రికార్డులను పరిశీలించారు. మండలంలోని గుండ్రెడ్డిపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ మాట్లాడుతూ మండలంలో రుణమాఫీ సక్రమంగా అమలయ్యే విధానాన్ని, వర్షాకాలంలో ఫెర్టిలైజర్స్ రైతులకు అందేలా చూడాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఫర్టిలైజర్స్ ఎంఆర్పీ రేట్లు మాత్రమే అమ్మాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి, తూప్రాన్ ఏవో గంగమల్లు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు మెడికల్ క్యాంప్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులకు డా. శిల్ప మెడికల్ క్యాంప్ (డెంటల్) మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులు సూర్ రెడ్డి, అంబరీష్, రమేష్, అశోక్, ఆంజనేయులు, లలిత, మాధవి, వీర మహేందర్, నిజామొద్దీన్, జ్ఞానోబా, పెంటయ్య, రమాదేవి, వినోద్ కుమార్, విజయ్ కుమార్, ఖాలేద్, ఆదిల్, సంగారెడ్డి బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాదులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

-సీపీ.డాక్టర్ బి. అనురాధ



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేటను గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సీపీ.డాక్టర్ బి.అనురాధ అన్నారు. మంగళవారం ఈనెల 28న జరిగే హాఫ్ మారథాన్ సెకండ్ ఎడిషన్ టీ షర్టును ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల ఏర్పడే పర్యవసానాలు గురించి సెకండ్ ఎడిషన్ ఆఫ్ మారథాన్‌లో పాల్గొనే వారికి అవగాహన కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకుని రన్నింగ్‌లో పాల్గొనే వారందరికీ టీ షర్టును, మెడల్స్ ఇవ్వడం జరుగుతుందని, హాఫ్ మారథాన్ సెకండ్ ఎడిషన్ రన్ ఒక ఆహ్లాదకరమైన వాతావరణంలో అత్యంత అద్భుతంగా పెద్ద పండుగ వాతావరణంలో నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్, ఐటీ సెల్ ఎస్ఐ నరేందర్ రెడ్డి, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తుల బాపురెడ్డి, కార్యవర్గ సభ్యులు రాజు, కృష్ణారెడ్డి, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట వ్యక్తి పురస్కార గ్రహీతకు జర్నలిస్టుల సన్మానం



నవ తెలంగాణ - సిద్దిపేట

తెలంగాణ శ్రీ వైష్ణవ సేవా సంఘం పురస్కారం అందుకున్న రంగాచారిని సిద్దిపేటలో జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ సంఘం పలు రంగాలలో కృషి చేసిన వారికి అందించే పురస్కారాలలో తనకు పత్రికా రంగంకు గాను విశిష్ట వ్యక్తి పురస్కారం రావడం సంతోషంగా ఉందని సిద్దిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలకుంట్ల రంగాచారి అన్నారు. . జర్నలిస్టు నాయకులు ఆయనకు పూలమాలవేసి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రమణరావు, ఆకుల పాండు, చిటుకుల మైసారెడ్డి, పాతర్ల వెంకటేశ్వర్లు, రంగదాంపల్లి శ్రీనివాస్ గౌడ్, సాజిద్, ఐత శ్రీనివాస్, షణ్ముఖ రాజు, రాజబాబు, యాదగిరి గౌడ్, మల్లారెడ్డి, సుజిత్ రెడ్డి, అశోక్, పి. రమేష్, సాయి, గిరి, నరేష్ పాల్గొన్నారు.

గ్రామాన్ని దత్తత తీసుకొని తేనెటీగల పెంపకం



నవతెలంగాణ -ములుగు

సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని ఉద్యానా విశ్వవిద్యాలయం తెలంగాణ బి హబ్ సొసైటీ (టీబీహెచ్ఎస్) హైదరాబాద్‌ల మధ్య మంగళవారం విశ్వవిద్యాలయ కార్యాలయంలో గౌరవనీయులు ఉపకులపతి డా.నీరజ ప్రభాకర్ విశ్వవిద్యాలయం అధికారుల సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. అవగాహన ఒప్పందంపై విశ్వవిద్యాలయం అధికారులు తెలంగాణ బీ హబ్ సొసైటీ హైదరాబాద్ సంస్థ తరపున, తేనెటీగల పంపకంలో అభివృద్ధి, కార్యక్రమాలను ప్రోత్సహించడం, నైపుణ్య అభివృద్ధి, విద్యార్థుల సాధికారత, ఉపాధి కల్పన కోర్సుల పురోగతి, ఉద్యానా పంటలపై తేనెటీగల పెంపకం సమర్థతపై పరిశోధన సహకారం, అధ్యయనాలు చేయటం, గ్రామాన్ని దత్తత తీసుకొని తేనెటీగల పెంపకం చేపట్టడం, ఆర్‌డబ్ల్యూహెచ్ ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ యువత, మహిళలకు తేనెటీగల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించడం. కె. ఇందిరా రెడ్డి, ఎన్ రామచంద్ర, నరేందర్ రెడ్డి, ఎస్.లక్ష్మణ్, శ్రీలత, డా. భగవాన్, డా. కిరణ్ కుమార్, డా.రాజశేఖర్, డా.విజయ, శ్రీనివాసన్‌లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

3 వ వార్డు కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మూడో వార్డు కౌన్సిలర్ మార్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్ అన్నారు. మంగళవారం వార్డులో సీజనల్ వ్యాధులపై ప్రజలతో చర్చించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. నీటి నిలువ ఉండే చోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలు స్థావరాలను ఏర్పరచుకుంటాయన్నారు. వాటి వల్ల డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్, ఫ్లూ, లాంటి విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అందజేసే మొక్కలను ప్రతి ఒక్కరు నాటి వాటి సంరక్షణను చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట స్టీల్ బ్యాంక్ గుర్తింపు ఘనత హరీశ్ రావుకే దక్కుతుంది

- మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు

నవ తెలంగాణ - సిద్దిపేట

ప్రతి ఏటా కేంద్రం వెలువరించే పార్లమెంట్ ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా బుక్‌లో సిద్దిపేట స్టీల్ బ్యాంక్ ప్రస్తావన రావడం గర్వాంగా ఉందని ఈ గుర్తింపు ఘనత హరీశ్ రావుకే దక్కుతుందని సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు అన్నారు. మంగళవారం పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజుతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్నే తన ఆరోగ్యంగా భావించే గొప్ప నాయకుడు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అని, పట్టణంలో దాదాపు1.57 లక్షల జనాభాను కలిగి ఉందని, ప్రజలకు ఎలాంటి అనారోగ్యాలు రాకుండా, ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు 51 లక్షలతో 34 వార్డులలో స్టీల్ బ్యాంకులను 2020లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని స్టీల్ బ్యాంక్ ల ఏర్పాట్లు, నిర్వహణపై హరీశ్ రావు ఎప్పటికప్పుడు ఆరా తీసేవారని తెలిపారు. సిద్దిపేట స్టీల్ బ్యాంక్ ఇంత ప్రావీణ్యం పొందడంలో ముఖ్య పాత్ర పోషించినటువంటి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావుకే ఈ ఘనత దక్కుతుందని అన్నారు. పట్టణంలోని ప్రజలకు పూర్తి స్థాయిలో స్టీల్ బ్యాంక్‌ల పట్ల అవగాహన కల్పించుటలో పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందరి పాత్ర ఉందని అన్నారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడడానికి ఋతు ప్రేమ కార్యక్రమాన్ని హరీశ్ రావు తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్రములోని అన్ని పట్టణాలలో స్వచ్ఛ బడి, స్టీల్ బ్యాంక్ సేవలు ఆచరణలోకి తీసుకరవలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు గోపాలపురం దీప్తి నాగరాజు, గ్యాదరి రవి, పసకుల సతీష్, మున్సిపల్ మాజీ చైర్మెన్ కడవేరుగు రాజనర్సు, బీఆర్ఎస్ నాయకులు మొహిజ్, వజీర్, గుడాల శ్రీకాంత్, మెప్మా అధికారులు సాయి కృష్ణ, రమ్య, జ్యోతి, పట్టణ ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జాతీయ స్థాయిలో గుర్తింపు సంతోషం....

స్టీల్ బ్యాంకు ఏర్పాటులో సిద్దిపేటకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉందని మాజీ జెడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ అన్నారు. మంగళవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకలు మోహన్ లాల్, గుండు భూపేష్, పాలసాయిరాం, సోమిరెడ్డిలతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు హరీశ్ రావు తోనే ఇలాంటి విజయాలు ప్రజల సొంతం అయ్యాయని అన్నారు. వినూత్న రీతిలో కొత్త పథకాలు పెట్టి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని, భారత ఆర్థిక సర్వేలో సిద్దిపేట చోటు సంతోషంగా ఉందన్నారు.



గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయడంలో హరీశ్ రావు కృషి ఎంతో ఉందన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు 45 అవార్డులు సిద్దిపేట నియోజకవర్గానికి రావడంలో హరీశ్ రావు కృషి ఎంతుందో తెలుస్తుందన్నారు. సమిష్టి కృషితో జాతీయ స్థాయిలో సిద్దిపేటకు పేరు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు కనకయ్య, మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, రవి గౌడ్, నరేష్ గౌడ్‌లు పాల్గొన్నారు.

రైస్ మిళ్లను తనిఖీ చేసిన అధికారులు





నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండలంలోని పలు రైస్ మిల్లులను అధికారులు తహసీల్దార్ విజయలక్ష్మి, సీఐ రంగకృష్ణ, ఎఐ శివానందలు తనిఖీలు చేశారు. రైస్ మిల్లుల్లో నిలువ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి, సంబంధించిన వివరాలను సేకరించారు. నవదుర్గ రైస్ మిల్‌లో నిలువ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి రైస్ మిల్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ తహసీల్దార్ విజయలక్ష్మి, సీఐ రంగకృష్ణ, ఎస్సై శివానంద్ లతోపాటు రెవెన్యూ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-వెల్దుర్తి

వెల్దుర్తి మండల కేంద్రంలోని శివసాయి బిన్నీ రైస్ మిల్లును తహసీల్దార్ తులసి రామ్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సేకరించిన ధాన్యం విలువలు సీఎంఆర్ రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ శివ సాయి బాయిల్డ్ రైస్ మిల్ సేకరించిన ధాన్యం సీఎంఆర్‌కు మధ్య వ్యత్యాసం ఉందన్నారు. దాదాపు రూ.16 లక్షల విలువ చేసే 810 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా తక్కువగా ఉన్న వరి ధాన్యంకు సంబంధించిన డబ్బులను చెల్లిస్తానని సంబంధిత రైస్ మిల్ యజమాని భైరవదాస్ లిఖితపూర్వకంగా హామీని ఇచ్చారని తెలిపారు. తనిఖీల్లో ఎంపీడీవో విగ్నేశ్వర్, ఎఐ నవత గౌడ్, రెవెన్యూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

సింగూరు ప్రాజెక్టుకు స్వల్ప వరద నీరు

నవతెలంగాణ-మెదక్ డెస్క్



ఉమ్మడి మెదక్ జిల్లాలోనే అతిపెద్ద ప్రాజెక్టు అయిన సింగూరు ప్రాజెక్టు అట్టి ప్రాజెక్టు నీటి పూర్తి సామర్థ్యం 30 టీఎంసీలు కాగా గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టులోకి స్వల్ప వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మంగళవారం నాటికి ప్రాజెక్టులోకి వచ్చే ఇన్ ఫ్లో 1375 క్యూసెక్కుల నీరు వస్తుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 13. 710 టీఎంసీల నీరు ప్రాజెక్టులో నిల్వ ఉందన్నారు గ తేడాది ఇదే సమయంలో సింగూరు ప్రాజెక్టులో 21. 272 టీఎంసీల నీరు నిల్వ ఉండేదన్నారు అంటే నీటితో ఎడమ కాలువ ద్వారా వ్యవసాయానికి రైతులకు నీరు విడుదల చేశామన్నారు. కానీ ఈ సంవత్సరం భారీ వర్షాలు కుర్యాకపోవడంతో ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిగా పడిపోయిందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు ప్రాజెక్టు ఎగువ బాగాలైన కర్ణాటక మహారాష్ట్ర లో భారీ వర్షాలు పడితే గాని ప్రాజెక్టులో కి నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు ఇలాంటి ముసురు వానలు పడితే ప్రాజెక్టులో చుక్క నీరు కూడా వచ్చే అవకాశాలు లేవన్నారు. కావున ఎడమ కాలువ పై ఆధారపడ్డ రైతులు ఈసారి ఎడమ కాలువ ద్వారా నీటిని వదిలే అవకాశాలు లేవన్నారు. కావున రైతులు అధైర్య పడకుండా ముందస్తు జాగ్రత్తగా ఇతర పంటలను సాగు చేసుకోవాలని వారు సూచించారు. వచ్చేనెల ఆగస్టు సెప్టెంబర్ లో భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టు నిండితే కానీ నీటిని వదిలే ప్రసక్తే లేదని వారన్నారు కావున ఎడమ కాలువ ఆధారపడ్డ రైతులు వీటిని గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారన్నారు

కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

నవతెలంగాణ-మర్కుక్



మంగళవారం కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపించి, అన్యాయం చేశారని, బడ్జెట్ అంకెల గారడీ ఉందని కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్యగౌడ్ ఆరోపించారు. బీజేపీ ఎంపీలు 8 మంది ఉన్న రాష్ట్రానికి సముచిత స్థానం తక్కలేదన్నారు. ఇద్దరూ కేంద్ర మంత్రులున్న తెలంగాణకు బడ్జెట్ లో నిధులు తీసుకురావడంలో విఫలమైయ్యారన్నారు.

నవతెలంగాణ -గజ్వేల్



కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు మొండిచేయి చూపించిన మోడీకి తగ్గిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు కళ్యాణ్కర్ నర్సింగ్ రావు అన్నారు. మంగళవారం ఆయన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఎనిమిది మంది ఎంపీలను ఇక్కడ ప్రజలు గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే ఏమి సాధించినట్లు అని ప్రశ్నించారు. అందులో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఉన్నారని బడ్జెట్లో రాష్ట్రానికి మొండిచేయి చూపడంపై మంత్రులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలను బీజేపీ మోసం చేసిందని బడ్జెట్‌లో స్పష్టం అవుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఏ ముఖం పెట్టుకొని తిరుగుతారో చూడాలన్నారు. బీజేపీ ఎంపీలను, కేంద్ర మంత్రులను ప్రజలు నిలదీయాలని కనీసం వారిని ఎన్నుకున్న నియోజకవర్గాల్లో ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రుల పదవుల కోసం కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు బడ్జెట్‌లో నిధులు తెలంగాణకు అడగలేదని బడ్జెట్‌తో తెలిసిపోయింది అన్నారు. మంత్రుల పదవులు ఇస్తే తప్ప తెలంగాణకు నిధులు అవసరం లేనట్టు అనిపిస్తుందన్నారు. బీజేపీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హమి పథకానికి తగినన్ని నిధులు కేటాయించకుండా తగ్గించారని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024-25 ఏడాదికి గ్రామీణ ఉపాధి చట్టానికి రూ.86 వేల కోట్లు మాత్రమే బడ్జెట్ కేటాయించారన్నారు. 2023-24 సం,,కి గ్రామీణ ఉపాధి చట్టానికి 86 వేల కోట్లు బడ్జెట్ కేటాయించారని గుర్తు చేశారు.2023-24 ఏడాదికి గ్రామీణ ఉపాధి చట్టానికి ఐన ఖర్చు రూ. 1.5లక్షల కోట్లు అని తెలిపారు. గత ఏడాది ఖర్చుతో పోల్చితే ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపు రూ.19.3వేల కోట్లు తక్కువన్నారు. గత ఏడాది మొదటి మూడు నెలల కంటే రూ. 5.74 కోట్ల పని దినాలు ఎక్కువ నమోదు అయ్యాయన్నారు. అంటే ఈ ఏడాది ఉపాధి హామీ పని దినాలు ఏడాదికి పని దినాల కంటే 5.6 శాతం ఎక్కువన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-సంగారెడ్డి



2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాల అభివృద్ధికి దోహదం చేసేలా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి వర్గాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపొందించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళలు, యువతకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉద్యోగ కల్పన, స్వయం ఉపాధికి పెద్దపీట వేశారన్నారు. నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చిన విధంగా అన్ని వర్గాలకు మేలు చేసేలా నిర్మలాసీతారామన్ బడ్జెట్ రూపకల్పన చేశారని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఊతం ఇచ్చేలా బడ్జెట్ ఉందని ఆమె స్పష్టం చేశారు.అన్నివర్గాలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ రూపకల్పన చేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ మండల శాఖ కార్యవర్గ సమావేశం


నవతెలంగాణ-నార్సింగి



మండల కేంద్రంలో మంగళవారం జీవిఆర్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ అధ్యక్షుడు బాల్ రెడ్డి అధ్యక్షతన నార్సింగి మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్ రెడ్డి మాట్లాడుతూ నార్సింగి మండల అభివృద్ధికి సంబంధించి పలు రాజకీయ తీర్మానాలను చేశారు. ముఖ్యంగా నార్సింగి మండల భవన సముదాయాలు, 50 పడకల ఆసుపత్రి, బస్ స్టాండ్ల ఏర్పాటు, మహిళా భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల ప్రహరీ గోడలు, మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ పాఠశాల, గ్రామాల్లోకి సర్వీస్ రోడ్లు, పట్టణంలోని లింక్ రోడ్ల నిర్మాణం కావాలని రాజకీయ తీర్మానం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాషాయ జెండాను నార్సింగి మండలంలో ఎగురవేసి మన ప్రియతమ నాయకుడు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావుకు కానుకగా ఇస్తామని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుబ్బాక అసెంబ్లీ కో కన్వీనర్, శక్తి కేంద్రాల ఇన్చార్జ్ లు, లింగారెడ్డి, భూషణం, మైలారం లక్ష్మణ్, దాసు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలుకై నిరసన

నవతెలంగాణ-జిన్నారం



కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని జిన్నారం మండల బీజేపీ పార్టీ శ్రేణులు మండల కేంద్రమైన జిన్నారంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మండల ఓబిసి అధ్యక్షుడు అగ్రహారం శంకర్, సంగారెడ్డి జిల్లా ఓబీసీ కార్యదర్శి చెన్నంశెట్టి ఉదయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కొత్త కాపు జగన్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు . అనంతరం జిన్నారం తాసిల్దార్ బిక్షపతికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, బూత్ అధ్యక్షులు వీరేష్ ,మహేష్, బిజెపి పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు .

ఆరు నెలల్లో ఐదు గ్యారంటీల అమలు

-గజ్వేల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంజాల రాజు గౌడ్



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో ఐదు గ్యారంటీలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని గజ్వేల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంజాల రాజు గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేండ్లు పాలించిన అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నది అన్నట్లుగా కనిపిస్తుందన్నారు. రోడ్లు, భవనాలు వేస్తే అభివృద్ధి సాధించినట్లు కాదని గతంలో లేవనెత్యామన్నారు. పదేండ్లల్లో సంపూర్ణం కాని అభివృద్ధిని ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్లా పూర్తి చేస్తుందన్నారు. పసిపిల్లాడు తప్పటడుగులు వేసినట్లుగా పదేండ్ల తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. సమన్వయంతో వేచి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే పథకాలను, అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు కళ్ళు తెరుచుకొని చూడాలన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఆగస్టు 15 లోపల పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అందులో భాగంగా లక్షల లోపు రుణాలను ఇప్పటికే రుణమాఫీ చేశారని గుర్తుకు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన, వర్గాల కోసం ప్రజా పాలన కొనసాగిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరి అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు వెళ్తామన్నారు. నియోజకవర్గంలో 50 శాతం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన తొగుట ఎస్ఐ


నవతెలంగాణ-తొగుట



మంగళవారం తొగుట పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్ఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన వి.రవికాంత్ రావు పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ను కలసి పూల మొక్కను అందజేశారు. పోలీసు కమిషనర్ ఎస్ఐని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, శాంతి భద్రతలకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నూతన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. నేను సైతం కార్యక్రమం ద్వారా గ్రామాలలో పనిచేయని సీసీ కెమెరాలు గ్రామస్తులు, వ్యాపారస్తులతో కలసి వెంటనే రిపేర్ చేయించాలని అన్నారు. గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాల రహిత జిల్లాగా సిద్దిపేటను తీర్చిదిద్దడానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

కురుస్తున్న మోస్తారు వర్షం

నవతెలంగాణ-గజ్వేల్



గత నాలుగైదు రోజులుగా గజ్వేల్ నియోజకవర్గంలో మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రజలు కొంత ఇబ్బంది గురవుతున్నారు. వరుసగా ఐదు రోజులపాటు మోస్తారు వర్షాలు కురవడంతో రైతులకు కొంత ఉపయోగపడుతున్నప్పటికీ చిరు వ్యాపారులపై కొంత ప్రభావం చూపుతుందని చెప్పాలి. రోడ్లపై చిరు వ్యాపారులు తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకొని జీవనము నడుపుతున్నారు. వరుసగా మోస్తారు వర్షాలు కురవడంతో చిరు వ్యాపారులు ఇంటికి పరిమితమయ్యారు. ఆదివారం కొన్ని గంటల మాత్రమే వర్షం విరామం ఇవ్వగా మంగళవారం తిరిగి ఉదయం నుంచే మోస్తారు వర్షం కురుస్తుంది. ప్రయాణికులకు, చిరు వ్యాపారులకు, నిత్య కూలీలకు ఈ వర్షం ఇబ్బందిగా మారింది. అదేవిధంగా పురాతన ఇండ్లు దెబ్బతిన్నాయి. దీనిపై అధికారులు పరిశీలన చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న ఇతర పంటలు కోసం రైతులు మూడు రోజుల క్రితం కురిసిన వర్షానికి విత్తనాలు విత్తినారు. మరికొందరు పత్తి విత్తనాల కోసం వెతుకులాటలో ఉన్నారని రైతుల ద్వారా తెలిసింది.

పంటల తెగుళ్ల నివారణకు రైతు నేస్తం

నవ తెలంగాణ-న్యాల్ కల్



వర్షాకాలం సాగులో రైతులకు మెలకువలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మంగళవారం న్యాల్‌కల్ మండలంలో ముంగి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సాగు పట్ల పత్తి పంటలో తెగుళ్ళ నివారణకు ఎలా తీసుకోవాలి జాగ్రత్తలపై రైతు నేస్తం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ బిక్షపతి , ఏఓ లావణ్య , ఏఈఓ సనీత్ రెడ్డి , నికిత , మాధవి , అర్చన , రైతులు ఉన్నారు

పంటల వివరాలు నమోదు

నవ తెలంగాణ-న్యాల్‌కల్ : సాగులో అధిక వర్షాలతో పంటలు వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని మండల ఏవో లావణ్య రైతులకు సూచించారు . గ్రామాల్లో రైతులు వేసిన పత్తి , సోయా , కందులు , చెరుకు , పంట సాగు వివరాలు నమోదు కొనసాగుతుందన్నారు . సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

మాజీ కలెక్టర్ హయాంలో భారీ అవినీతి

బీజేపీ రాష్ట్ర నాయకులు దారం గురువా రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

సిద్దిపేట మాజీ కలెక్టర్ రాంరెడ్డి హయంలో భారీ అవినీతి జరిగిందని బీజేపీ రాష్ట్ర నాయకులు దారం గురువారెడ్డి ఆరోపించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని బీజేపీ ఆఫీస్‌లో నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట కమిషనరేట్, కలెక్టరేట్ పరిధిలోని మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందన్నారు. వాటికి సంబంధించి వర్గల్ ఇండస్ట్రియల్ పార్క్, టీఎస్ఐఐసీలో 1350 ఎకరాలు దీనిలో జరిగిన అవకతవకలకు పాల్పడ్డారన్నారు. రైతులకు సరైన నష్ట పరిహారం ఇవ్వకుండా బలవంతంగా భూములను లాక్కొని ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో కార్పొరేట్ సంస్థలకు అధిక ధరలకు అమ్ముకొని లాభాలు గడించిది. గత ప్రభుత్వమే అన్నారు. అందులో సర్వేనెంబర్ 845, 1209, 1266లలో 371 ఎకరాలకు ఒక దొంగ నోటిఫికేషన్‌తో ఆక్రమించుకునే ప్రయత్నాన్ని హైకోర్టు ఆర్డర్‌తో ఆపేశారన్నారు. దీనిపై గ్రీన్ ట్రిబ్యునల్‌లో స్టే కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో భూములు కోల్పోయిన రైతులకు వారి పక్షాన భారతీయ జనతా పార్టీ ఇప్పుడు ఉన్న ప్రభుత్వంతో కొట్లాడి తగిన నష్ట పరిహారం ఇప్పిస్తామన్నారు. తమ భూములను కాపాడుకోవడానికి మమ్మల్ని సంప్రదించవచ్చని రైతుల పక్షాన బీజేపీ నిలబడుతుందన్నారు. సిద్దిపేట జిల్లాలో అభివృద్ధి పేరుతో పేద రైతుల భూములను వేలాది ఎకరాలు కొల్లగొట్టిందన్నారు. గత ప్రభుత్వం వారికి అండగా నిలబడుతున్న ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్న నాయకులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. రైతులు మమ్మల్ని సంప్రదిస్తే వారికి పూర్తి న్యాయం జరిగేదాకా బీజేపీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షులు మనోహర్ యాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కుడిక్యాల రాములు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు నత్తి శివకుమార్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండం శ్రీనివాస్ రెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా అధికార ప్రతినిధి వెంకట్రాంరెడ్డి, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు నాయిని సందీప్, బీజేవైఎం జిల్లా నాయకులు మహిపాల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.